ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

ఫిబ్రవరి 21, 2010

కథా నిలయం
Entered
శ్రీకాకుళం

నయా వంచనలు

హ్యాపీ బర్త్‌డే

(2010 ఫిబ్రవరి 21 నుంచి
2010 ఫిబ్రవరి 27 వరకు)

ఎం. ఫణీంద్ర
2సం॥, ఫిబ్రవరి-22
జ్యోతి-వెంకటేశులు
రంగేపల్లి-అనంతపురం

పి. ప్రియదర్శిని
ఫిబ్రవరి
రజని-రాజు
మచిలీపట్నం-కృష్ణా

జి. చరిత
6సం॥, ఫిబ్రవరి-25
భాగ్య-నారాయణస్వామి
ధర్మవరం-అనంతపురం

రాకేష్
2సం॥, ఫిబ్రవరి-25
భారతి-రామకృష్ణ
పిరిడి-విజయనగరం

ఎస్. లహరి
2సం॥, ఫిబ్రవరి-25
కృష్ణవేణి-సింహం
ఓల్డ్‌బోయిన్‌పల్లి-సికింద్రాబాద్

ఎ. మహేష్
ఫిబ్రవరి
ఐలమ్మ-బాలయ్య
గడ్డమల్లాయగూడ-రంగారెడ్డి

ఎం. కౌసల్య
9సం॥, ఫిబ్రవరి-27
సౌజన్య-సురేంద్రనాథ్
యడ్లపాడు-గుంటూరు

పి. మనోహర్ చౌదరి
8సం॥, ఫిబ్రవరి-27
ధనలక్ష్మి-శ్రీనివాసరావు
కొవ్వూరు-ప॥గో॥

పి. మేఘనచౌదరి
6సం॥, ఫిబ్రవరి-27
ధనలక్ష్మి-శ్రీనివాసరావు
కొవ్వూరు-ప॥గో

రోహన్-రోషన్
7సం॥, ఫిబ్రవరి-22
రజిత-మోహన్
వైరా-ఖమ్మం

బి. వైభవ్
2సం॥, ఫిబ్రవరి-27
మణిశ్రీ-బాలకిషన్
సింగాపూర్-రంగారెడ్డి

ENTERED

కథా నిలయం
శ్రీకాకుళం

మనలో మాట

భాషా వికాసం

పూర్వం ఒక చీమకు మనుషుల మీద విపరీతమైన కోపం వచ్చింది. ఎలాగైనా వారిపై ఆధిపత్యం సంపాదించాలని ఘోరమైన తపస్సు చేసింది. దేవుడు ప్రత్యక్షమై, ఏం కావాలో కోరుకోమంటే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయింది. వెంటనే, 'నేను కుట్టిన వెంటనే చచ్చిపోవాలి' అని కోరేసింది! దాని ఉద్దేశం 'మనిషి చావాలీ' అని. దేవుడు 'తథాస్తు' అని అదృశ్యమైపోయాడు. వరం ఎలా పని చేస్తుందో చూద్దామనుకున్న చీమకు అదే ఆఖరి క్షణం అయింది. అటుగా వెళుతున్న ఓ మనిషి కాలుమీద అది కసిదీరా కుట్టడం, రెండో క్షణంలోనే మనిషి రెండో కాలు చీమను టపీమని నలిపేయడం, చీమ హరీమనడం జరిగిపోయాయి. చీమ చరిత్ర ఇలా అర్ధరహితంగా ముగిసిపోవడానికి కారణం ఏమిటి? దానికి వ్యాకరణం సరిగ్గా తెలియకపోవడమే!

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అంటారు. భాష బాగుంటే బాగా రాణిస్తావు అనే దాని అర్ధం.. భాషా ప్రయోగాన్ని బట్టి వ్యవహారాలు నడుస్తుంటాయి. కోపమొస్తే చాలామంది ఇంగ్లీషులో తిడతారు. ఎందుకంటే- సొంత భాష కన్నా ఎరువు భాష పవరు'ఫుల్లు' కనుక. ఈ ధోరణి దొరల కాలంనుంచే కాదు, అంతకు పూర్వమూ ఉంది. పండితులకో మునులకో కోపమొస్తే సంస్కృతంలో శపించేవాళ్లు. అప్పడైనా, ఇప్పడైనా తెలుగులో తిట్లూ శాపనార్థాలూ కొరతై కాదు. అవతలి మనిషికీ అవన్నీ నాటుగా తెలిసి ఉంటాయి కాబట్టి, అతడూ అందుకుంటే వ్యవహారం రణరంగం అవుతుంది కాబట్టి... పరాయి భాషను ప్రయోగించడం సేఫ్టీ అన్నమాట!

అప్పుడప్పుడు వ్యాకరణం గొప్పదా? వ్యవహారం గొప్పదా? అన్న మీమాంస తలెత్తుతుంది. అనుభవంలోంచి చూస్తే- వ్యాకరణం కన్నా వ్యవహారమే భేషైనది. వ్యాకరణాన్ని పక్కాగా పాటించే పండితుడు తెలుగు నాట ఏ హోటల్లోనూ భోజనం చేయలేడు. దాదాపు అన్నిచోట్లా 'శాఖాహార, మాంసహార హోటలు' అని రాసి ఉంటుంది. పండిత భాష ప్రకారం తర్కించి చూస్తే- ఆ హోటల్లో చెట్ల కొమ్మలు పళ్లెంలో పెట్టి, మాంసం గుచ్చిన దండలు మెడలో వేస్తారన్నమాట! అలాంటప్పుడు భాషను పట్టుకు కూర్చుంటే- బువ్వ దొరకదు మరి! కొంతమంది భాషా పరిరక్షణకు 'శివా'లెత్తి నర్తిస్తారు. ఫలానా భాషే మాట్లాడాలి, ఫలానా భాష మాట్లాడకూడదు అని హుంకరిస్తారు. నిజానికి ఆదేశాలతోనూ, ఆవేశాలతోనూ భాష వర్ధిల్లదు. అది అవసరాలకు ఏ మేరకు దోహదపడితే ఆ మేరకు వికసిస్తుంది. తెలుగు భాషకు ప్రాచీనహోదా దక్కి ఏడాది దాటి పోయింది. మరి భాషావికాసం ఎన్ని మైలురాళ్లు దాటిందీ అంటే- చెప్పడం కష్టమే!

అదిగో, నేడు మాతృభాషా దినోత్సవం సందర్భంగా సభ జరుగుతోంది. అధికార పార్టీ నాయకుడు ఆవేశంగా ప్రసంగిస్తున్నాడు. తెలుగు భాషా వికాసాన్ని ఆయన మాటల్లోనే దర్శిద్దాం: 'మన తెలుగు చాలా ప్రాచీన భాష. అంటే ఓల్డు భాష. దానిని మోడర్నైజ్ చేయటానికి నేను గట్టిగా కృషి చేస్తానని మనవి చేస్తున్నాను.'

హతవిధీ.. ఇదీ, కత!

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
సినిమా కబుర్లు	...	7
వివాహం చేసుకోండయా! వాయనం అందుకోండయా!!...		10
క్రైమ్‌కథ	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
సీరియల్	...	18
విజ్ఞానవీచిక	...	20
చూద్దామా	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

ఆ అక్షరోత్తేజంతో ముమ్ముందుకు...

కథ ... 8

ఖైదీ

ఆరోగ్యం ... 17

చిన్నారులు చురుగ్గా వుండాలంటే...



బాల సాహిత్యం అదుర్స్

ఈ వారం స్నేహ సంచిక అట్టమీది కథగా 'వింతల లోకంలో తెలుగిన్నిస్' మదనయ్యగారి రచన ద్వారా గిన్నిస్‌బుక్‌ను అధిరోహించిన తెలుగు వీరుల కథనాలు అందించడం అభినందనీయం. పంచభూతలింగ క్షేత్రాల సమాచారం చూద్దామా ద్వారా మాకందింది. ఏమిటో కలికాలంలో విపరీత బుద్ధులంటే కీటక చాక్లెట్ల ఆరగింపు విశేషాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయనిపిస్తుంది. ఇంకా... కవిత్వమ్ పేజీలోని అడిగోపుల వెంకటరత్నం, ఆశారాజు కవితా సుమాలు సామాజిక స్పృహతో కూడి ఉండడం గమనార్హం. ఎటువంటి భేషజాలకు పోకుండా నవ్వించడమే పనిగా పెట్టుకుని హాస్యనటుల రారాజుగా వెలిగిపోతున్న బ్రహ్మానందం మనకు తెలుగువాడవ్వడం అదృష్టం అని చెప్పక తప్పదు. అనసూయ గారి కాలేజీ కథ బావుంది. బాలనేస్తాలులో చిత్రవిచిత్రం బహుగమ్మత్తు అనుభూతినిచ్చింది. సాహిల్ గారి బాల సాహిత్యం అదుర్స్. మనలోమాట వంగతోట కాడ బావా మరదళ్లే కాదు ఇక అందరి ఒళ్లు జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం వచ్చినట్లయింది. మనకేది ఎంత ఇష్టమో అదే మనకు దూరమై పోతుందంటే దానికి ప్రస్తుత నిదర్శనం వంకాయేమో!!

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

చెప్పలేనంత ఆనందం

'వింతల లోకంలో తెలుగిన్నిస్'లో దాసరి నారాయణరావు, విజయనిర్మల, డి.రామానాయుడు, హాస్యచక్రవర్తి బ్రహ్మానందం వున్నారని చదివాక ఎంతో సంతోషం కలిగింది. బాలసుబ్రహ్మణ్యం 36,000 పాటలు పాడారని, గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కారని తెలుసుకుని చెప్పలేనంత ఆనందం పొందాను. ఆయన జోక్సు కూడా బాగా వేస్తారు. తొలిరోజుల్లో కాకినాడ సూర్యకళామందిరానికి వచ్చి సంగీత కచేరి చేశారు. అప్పుడు కార్యక్రమం చివర ఆటోగ్రాఫ్ కోసం అందరూ ఆయన మీద పడుతుంటే నేను మాత్రం ఆయన జేబురుమాలు గుర్తుగా ఇమ్మని అడిగాను. ఆయన వెంటనే చిరునవ్వులు చిందిస్తూ ఈ రుమాలును నాకొక ప్రొడ్యూసర్ గుర్తుగా ఇచ్చారు. ఇది నీకు ఇస్తే నేను ఆయనను మరవడం జరుగుతుంది. ఆయన పాటల రికార్డింగ్ వాయిదా పడుతుంది బ్రదర్ అన్నారు. ఈ జోక్ నాకు తరచూ గుర్తుకు వస్తూ వుంటుంది. ఇప్పటికి మా కళాకారులకు, మేమూ సాంస్కృతిక కార్యక్రమాలు చేసేటప్పుడు సందర్భానుసారంగా ప్రేక్షకులకు చెపుతూ ఉంటాను. 42 రెండు సినిమాలకు దర్శకత్వం వహించి గిన్నిస్ బుక్‌లో రికార్డు అయిన విజయనిర్మల తెలుగుదనం, సంస్కృతి వుట్టిపడే చిత్రాలకు మళ్లీ దర్శకత్వం వహించాలని కోరుకుంటున్నాం.

జె.సుధాకర్ పట్నాయక్,
కాకినాడ.

చక్కగా వివరించారు

ఫిబ్రవరి 7 ఆదివారం అనుబంధంలో చూద్దామాలో వచ్చిన 'పంచభూత లింగ క్షేత్రాలు' బాగా నచ్చింది. ఈ శీర్షికలో దక్షిణ భారతదేశంలో వున్న శైవ క్షేత్రాలన్నింటినీ చక్కగా వివరించారు. విజ్ఞాన వీచికలో వండకుండా తినే బియ్యం గురించి తెలిపారు. మనం వండుకుని తినే కూరగాయలతోనే అనేక వ్యాధుల బారిన పడుతున్నాం. అసలు వండకుండా తినేస్తే అజీర్తి సమస్యలు రావా? అస్సాం ప్రజలు ఇప్పటికే తింటున్నారు కదా! మరి వారికి ఎటువంటి సమస్యలూ లేనప్పుడు ఇటువంటి బియ్యాన్ని అందరికీ అందుబాటులోకి తెస్తే చాలా బావుంటుంది కదా. సినిమా కబుర్లలో బ్రహ్మానందం గురించి భలేగా చెప్పారు. ఆయన మొదటి సినిమా అహనా పెళ్లంట అనే అనుకునేవారం. కానీ అదికాదు తాతావతారం అతని మొదటి సినిమా అని ఈ శీర్షిక చదివాకే తెలిసింది. బ్రహ్మానందం అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ ఎవర్‌గ్రీన్ కామెడీ కింగే. ఆయనకు డైలాగులతో కూడా పని లేదు. ఒట్టి హావభావాలతోనే కడుపుబ్బ నవ్వించే సత్తా ఆయన సొంతం.

ఉమాదేవి, గుంటూరు.

సృజనాత్మకతను వెలికితీసేదిలా...

ఫిబ్రవరి 7 ఆదివారం అనుబంధంలో అట్టమీది కథ 'వింతల లోకంలో తెలుగిన్నిస్' చదివిన తర్వాత మానవుల్లో అద్భుతమైన అంతర్గత మేధాశక్తి ఎలా దాగి వుంటుందో, మానవునిలో సృజనాత్మక నైపుణ్యాలు ఊహకందని విధంగా ఎలా అద్భుతాలు సృష్టిస్తున్నాయో బోధపడుతుంది. మన రాష్ట్రంలో ఇలాంటి మహా మేధా సంపన్నులు ఉండడం చరిత్రలో తెలుగువారు గర్వించదగిన విషయం. వారు మహామేధావులుగా నిలిచిపోతారు. ఎన్.మదనయ్య రాసిన వ్యాసం నేను కూడా ఏదోటి చేసి రికార్డు సాధించాలనే స్ఫూర్తి కలిగించింది. ఇంకా ఇది చదివిన ఎందరికో

వాళ్లలో అంతర్గతంగా నిద్రాణమై ఉన్న సృజనాత్మక శక్తులను వెలికితీయాలనే ఆలోచనలు, స్ఫూర్తిని కలిగిస్తుందనడంలో అతిశయోక్తిలేదు. ఈ విధంగా జ్ఞాన నిర్మాణాత్మక రంగంలో ఇంకా ఎన్నో వింతలు విశేషాలు కలిగేలా తమ ప్రతిభను నిరూపించుకుని వారు రాష్ట్ర అభివృద్ధికి దిక్సూచిగా వుండాలని ఆశిస్తూ, ఇలాంటి మంచి కథనాన్ని తెలుగు రాష్ట్ర ప్రజలకు అందించిన ప్రజాశక్తి స్నేహకు అభినందనలు.

పాకాల శ్రీనివాస్‌రెడ్డి, పరకాల,
వరంగల్.

అందరూ చదవదగింది

1930-40 ప్రాంతంలో విశ్వనాథ సత్యనారాయణ (విజయవాడ)గారి వేయిపడగలు నవల చాలా ప్రాచుర్యం పొందింది. సాహిత్య విలువలున్నా సామాజిక విలువలు లేవు. వర్ణాశ్రమ ధర్మాన్ని, జమిందారీ వ్యవస్థను నవల పూర్తిగా సమర్థించింది. ప్రజల సాహిత్యం పదికాలాల పాటు నిలుస్తుంది. నండూరి గారికి ఈ నవల ప్రేరణ అయినప్పటికీ ఆయన కలం నుండి వెలువడిన అద్భుత గ్రంథాలు విశ్వరూపం, నరావతారం నేటికీ సజీవంగా ఉన్నాయి. వియత్నాం గెరిల్లా సీరియల్ అందరూ చదవదగింది.

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

★



కంద పులుసు

కావలసిన పదార్థాలు

కంద - అరకిలో
పచ్చిమిర్చి - 4
నూనె - 2 టేబుల్ స్పూన్లు
ఆవాలు - అరస్పూన్
పసుపు - చిటికెడు
కారం - 1స్పూన్
ఉప్పు - తగినంత
చింతపండు - నిమ్మకాయంత
ఉల్లిపాయ - 1
కరివేపాకు - 2 రెమ్మలు
కొత్తిమీర - కొద్దిగా

తయారుచేసే విధానం

కంద ముక్కలు మరీ మెత్తగా కాకుండా ఉడికించి చిన్న ముక్కలుగా కోసి వుంచుకోవాలి. స్టవ్‌మీద బాండీ పెట్టి నూనె పోసి బాగా కాగాక ఆవాలు, మిర్చి ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా వేగాక కంద ముక్కలు కూడా వేసి కొంచెం వేగనివ్వాలి. ముక్కలు వేగాక పసుపు, కారం, ఉప్పు వేసి కలియబెట్టి చింతపులుసు పోసి మరగనివ్వాలి. పులుసు బాగా కాగాక కరివేపాకు, కొత్తిమీర వేయాలి. కంద పులుసు అన్నంలోకే కాక చపాతీల్లోకి కూడా బావుంటుంది.

ఉల్లికారం మసాలా వంకాయ

కావలసిన పదార్థాలు

వంకాయలు - పావుకేజీ
ఉల్లిపాయలు - 2 పెద్దవి
కారం - 2 టేబుల్ స్పూన్లు
నూనె - 2 టేబుల్ స్పూన్లు
ఉప్పు - తగినంత
పసుపు - చిటికెడు

తయారుచేసే విధానం

వంకాయలు లేతగా, కొంచెం లావుగా వున్నవి తీసుకుని శుభ్రంచేసి కాయను తొడిమ వైపు విడిపోకుండా నాలుగు ముక్కలుగా కోసుకోవాలి. ఉల్లిపాయ ముక్కలు, కారం, ఉప్పు, పసుపు మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. నాలుగు భాగాలుగా కోసుకున్న వంకాయలో గ్రైండ్‌చేసి పెట్టుకున్న ఉల్లికారం కూర్చాలి. స్టౌమీద బాండీ వుంచి నూనెపోసి బాగా కాగాక ఒక్కొక్క వంకాయను అందులో వేసి ముక్కలు విడిపోకుండా జాగ్రత్తగా రెండు వైపులా వేయించాలి. వేడివేడి అన్నంలోకి చాలా బావుంటుంది.


తోటకూర చపాతీలు

ఉల్లికారం మసాలా వంకాయ


కంద పులుసు


మునగకూర పప్పు

తోటకూర చపాతీలు

కావలసిన పదార్థాలు

తోటకూర కట్ట - 1
గోధుమ పిండి - 250 గ్రా
ఉప్పు - తగినంత
పసుపు - చిటికెడు
అల్లం - చిన్నముక్క
నూనె/నెయ్యి - 50 గ్రా

తయారుచేసే విధానం

ముందుగా శుభ్రంచేసిన తోటకూరను సన్నగా తరగాలి. గోధుమపిండిలో తరిగిన తోటకూర, ఉప్పు, పసుపు, నూరిన అల్లం, పచ్చిమిర్చి ముద్ద వేసి చపాతీ పిండిలా కలిపి ఒక అరగంట నాననివ్వాలి. తర్వాత చిన్న వుండలు చేసుకుని చపాతీల్లాగా వత్తుకుని నూనెతో గానీ నెయ్యితో గానీ కాల్చాలి. కాల్చిన వెంటనే వేడిగా లాగిస్తే సూపర్‌గుంటుంది.

మునగకూర పప్పు

కావలసిన పదార్థాలు

లేత మునగ ఆకు - 2 గుప్పెళ్లు
పచ్చిమిర్చి - 4
కందిపప్పు - 100గ్రా
చింతపండు - ఉసిరికాయంత
వెల్లుల్లి - 2రెబ్బలు
ఉప్పు - తగినంత
పసుపు - చిటికెడు
కారం - అరస్పూన్
కొత్తిమీర - కొంచెం
నూనె - 2 స్పూన్లు
తాలింపు గింజలు - అరస్పూన్

తయారుచేసే విధానం

ముందుగా కందిపప్పును మరీ మెత్తగా కాకుండా ఉడికించుకోవాలి. లేత మునగాకును శుభ్రం చేసి పెట్టుకోవాలి. స్టవ్ మీద బాండీ వుంచి నూనె పోసి కాగాక తాలింపు గింజలు వేసి చిటపటలాడాక వెల్లుల్లి, పసుపు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. అందులో మునగాకు వేసి ఉడికిన తర్వాత ఉడికించిన పప్పుకూడా అందులో వేసి బాగా కలియబెట్టాలి. ఇది అన్నంలోకి, చపాతీల్లోకి బాగుంటుంది. ★

చిట్కా

పళ్లరసాన్ని తీసిన తర్వాత ఎక్కువసేపు అలాగే ఉంచితే అందులోని సి విటమిన్ హరించుకుపోతుంది. కనుక తాగేటప్పుడు ఫ్రెష్‌గా తీసుకుని తాగండి.



స్ఫూర్తి

ఆ అక్షరోత్తేజంతో ముందుకు...

కె.స్వరూపరాణి,
ఐద్వా రాష్ట్ర కార్యదర్శి.

ఒక పుస్తకం స్ఫూర్తినిచ్చిందని చెప్పలేనుగానీ... నాకు ఉత్తేజాన్నిచ్చిన పుస్తకాలను మాత్రం ఎన్నటికీ మర్చిపోలేను. 1977లో సిపిఎం సభ్యత్వం పొందాక మొదటిసారిగా నేను చదివిన



వీరి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి పరులేకర్ దంపతులు చేసిన కృషి, త్యాగం అంతా ఇంతని చెప్పలేం. కడుపులో చల్ల కదలకుండా బతకగల కుటుంబాలనుంచి వచ్చి అడవుల్లో గిరిజనుల మధ్య ... స్నానానికి నీళ్లు, తినడానికి తిండి, ఆఖరుకు తాగడానికి టీ కూడా లేకుండా రోజులు గడిపారు. వీరి త్యాగాలు, వీరి అండలో ఆదివాసులు జరిపిన పోరాటాలను కళ్లకు కట్టిన పుస్తకం 'వర్లీ ఆదివాసుల తిరుగుబాటు'. ఆ పోరాటాలు వృథా పోలేదనడానికి ఒక ఉదాహరణ చెప్పుకోవచ్చు. నేటికీ ధానే స్థానం సిపిఎందే. అంతటి ఉత్తేజాన్నిచ్చిన పోరాటాలకు అక్షరరూపమైన ఈ చిన్ని పుస్తకం నా మీద వేసిన ముద్ర అంతా ఇంతా కాదు.

పుస్తకం సుందరయ్యగారు రచించిన 'తెలంగాణా పోరాటం-అనుభవాలు-గుణపాఠాలు'. ఆ వీరోచిత ఘట్టాలు, ఆ పోరాటంలో మహిళల పాత్ర నేను ఉద్యమంలో పనిచేయడానికి ప్రభావితం చేసింది. 1985లో పూర్తికాలం కార్యకర్తనయ్యాను. ఎకెజి జీవిత చరిత్ర, చైనాపై అరుణతార, అమ్మ, విప్లవపథంలో నా పయనం వంటి పుస్తకాల్లోని పోరాట ఘట్టాలు నన్ను ఉద్యమంలో పనిచేయడానికి పురికొల్పాయి. ఎంతగానో తోడ్పడ్డాయి. ముఖ్యంగా గోదావరి పరులేకర్ వర్లీ ఆదివాసుల తిరుగుబాటు పుస్తకాన్ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

మహారాష్ట్రలో ధానే జిల్లా ఒకటి. అక్కడ అనేక గిరిజన జాతులు నివసించేవి. ఈ ఆదివాసి జనాభాలో 50 శాతం వర్లీలు. శతాబ్దం కిందట ఈ ప్రాంత భూమికంతా వీరే యజమానులు. కావాల్సినంత పండించుకొని ప్రశాంతంగా జీవించేవారు. అయితే అనేకమంది వారి నిరక్షరాస్యతను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని క్రమేణా వారి భూములను కాజేశారు. రానురాను ఆదివాసులు భూమిలో అత్యధికభాగం కొత్తగా వచ్చినవారి పరమైంది. ఆ భూమిని సొంతం చేసుకున్న భూస్వాములు వారిపై పెత్తనం చేయడానికి పలురకాల మార్గాలను అనుసరించేవారు. అప్పట్లో వారికి రోడ్డుగానీ, ఆసుపత్రులుగానీ, పాఠశాలలుగానీ ఏవీ వుండేవికావు. వున్నదల్లా దారిద్ర్యం, అమానుషత్వం, దుఃఖం, వ్యాధులు, అజ్ఞానం మాత్రమే. గంజి తాగుతూ, ఆకులు, దుంపలు, కందమూలాలు తింటూ రోజులీడ్చేవారు. ఆఖరుకు ముతకబియ్యం అన్నం కూడా వారికి అరుదుగానే అందేది. వంటినిండా బట్ట కూడా కొరవే. వీటికి తోడు భూస్వాముల దోపిడీ. తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకోబోయే వరకు వారి పొలాల్లో పనిచేస్తే అందేది తినడానికి వడ్లు మాత్రమే. అదే వారి కూలి. దీనికి తోడు రోజుకొకరు చొప్పున భూస్వాముల ఇళ్లల్లో దాస్యం చేయాలి. మహిళలది మరీ దయనీయమైన జీవితం. భూస్వాములు, కాంట్రాక్టర్లు అదనంగా వీరిని లైంగికంగా దోచుకునేవారు. అయితే వీరిని దోచుకునే భూస్వాములది మాత్రం వైభోగమే. దోపిడీ మరణపు కబంధ హస్తాల్లో నలిగి చెప్పనలవిగాని భయోత్పాతపు బతుకు వెళ్లబుచ్చేవారు. జీవితమంతా చిత్రహింసలకు గురైనప్పటికీ ఇక వాటిని ఒక్క క్షణం కూడా భరించలేని స్థితికి చేరుకున్నారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో తిరుగుబాటు చేశారు. తమను దోచుకుంటున్నవారికి వ్యతిరేకంగా వారు సాహసోపేత పోరాటం సాగించారు. అజ్ఞానం నుంచి, సాధారణ ఆలోచనలతో సతమతమయ్యే స్థితి నుంచి మనుషులుగా మారారు. దీనికి గోదావరి పరులేకర్, శ్యామ్‌రావ్ పరులేకర్ చూపించిన మార్గమే కారణం. భూస్వాముల క్రూరత్వాన్ని, హింసాకాండను ప్రశ్నించడం నేర్చుకున్నారు. వెట్టి చాకిరీ, అప్పు బానిసత్వ విముక్తి కోసం ఎర్రజెండా పట్టుకుని తిరగబడడం మొదలెట్టారు. వీరి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి పరులేకర్ దంపతులు చేసిన కృషి, త్యాగం అంతా ఇంతని చెప్పలేం. కడుపులో చల్ల కదలకుండా బతకగల కుటుంబాలనుంచి వచ్చి అడవుల్లో గిరిజనుల మధ్య ... స్నానానికి నీళ్లు, తినడానికి తిండి, ఆఖరుకు తాగడానికి టీ కూడా లేకుండా రోజులు గడిపారు. వీరి త్యాగాలు, వీరి అండలో ఆదివాసులు జరిపిన పోరాటాలను కళ్లకు కట్టిన పుస్తకం 'వర్లీ ఆదివాసుల తిరుగుబాటు'. ఆ పోరాటాలు వృథా పోలేదనడానికి ఒక ఉదాహరణ చెప్పుకోవచ్చు. నేటికీ ధానే స్థానం సిపిఎందే. అంతటి ఉత్తేజాన్నిచ్చిన పోరాటాలకు అక్షరరూపమైన ఈ చిన్ని పుస్తకం నా మీద వేసిన ముద్ర అంతా ఇంతా కాదు.

నేను ఒక సనాతన కుటుంబం నుంచి వచ్చాను. అడుగడుగునా ఆంక్షలతో బాల్యం గడిచింది. ఆడపిల్లలకు చదువు అవసరం లేదని హైస్కూల్ విద్యతోనే ఆపించేశారు నాన్న. ఆయనతో పోట్లాడి మూడురోజుల పాటు అన్నంనీళ్లు మానేసి పట్టుపట్టి హైస్కూల్లో చేరా. అలా ఎస్ ఎస్ ఎల్ సి వరకు చదువుకున్నా (పదకొండవ తరగతితో సమానం). నాన్నగారిది స్థితిమంతుల కుటుంబం. కమ్యూనిస్టు వ్యతిరేకత వుండేది. అయితే అమ్మ తరపు వాళ్లు కమ్యూనిస్టు పార్టీ. మాకు కావాల్సిన బట్టలు కూడా నాన్నే తెచ్చేవారు. ఆడవాళ్లు బయటికెళ్లకూడదనే ఛాందస భావాలు ఆయనకుండేవి. అమ్మకూడా నాన్నతో మాట్లాడ్డానికి భయపడేది. ఎంతసేపూ చీరలు, నగల ముచ్చట్లు తప్ప రాజకీయ చర్చలు వుండేవికావు. అలాంటిది అమ్మమ్మ దగ్గరకొచ్చాకే

కాస్త రాజకీయాల గురించి మెల్లగా తెలియసాగింది. అమ్మమ్మ పిన్ని పార్టీ కార్యకర్తలకు అన్నం తీసుకెళుతున్నారని తెల్సి ఓసారి పోలీసులు మా ఇంటిమీద దాడి చేశారు. ఇంట్లో వున్న ఫర్నీచర్ ధ్వంసం చేశారు. 'భోజనం తీసుకెళ్లేది ఎవరికి? ఇంటికి ఎవరొచ్చారు?' చెప్పమంటూ వేధించారు. బలరామయ్యగారు చూస్తుండగానే అమ్మమ్మను 42 కొరడా దెబ్బలు కొట్టారు. అది చూసి ఆయనకు కాంగ్రెస్ ప్రభుత్వం మీద కసి పెరిగింది.

నా విషయానికొస్తే 1975 నుంచి రాజకీయ ప్రవేశం కలిగింది. బలరామయ్యగారి బలవంతంమీద 'మా భూమి' నాటకంలో సీత పాత్ర వేయడానికి ఒప్పుకున్నా. అప్పటి వరకు రాజకీయాల గురించి తెలియదు. అలా నాటకం కోసం తెలంగాణా పోరాటం గురించి చదవడానికి, నాటకంలోని ఘట్టాల గురించి తెలుసుకోవడానికి అవకాశం కలిగింది. అప్పటినుంచి పార్టీ పుస్తకాలు చదవడం మొదలెట్టా. వాటిలో నాకు స్ఫూర్తినిచ్చిన పుస్తకాల గురించి చెప్పుకోవాలంటే... మొదట ఎకెజి పుస్తకం గురించి చెప్పుకోవాలి. ఆయన జీవితం అంతా పోరాటాల మయం. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను తీసుకొని పోరాడిన వైనాన్ని ఆ పుస్తకం వివరిస్తుంది. ఆ పుస్తకం ద్వారా ఆయన ఇచ్చిన స్ఫూర్తి ఎన్నోసార్లు నాకు నా పనిలో ఉపయోగపడింది. నామీద 'చైనాపై అరుణతార' పుస్తకం వేసిన ప్రభావం అంతా ఇంతా కాదు. లాంగ్‌మార్చ్ సందర్భంగా పిల్లలను కూడా వదిలేసి మహిళలు మైళ్లకు మైళ్లు పాల్గొనడం నన్ను కదిలించివేసింది. ఆ పుస్తకం చదువుతుంటే సామ్రాజ్యవాదానికి, సమాజంలో వున్న అణచివేతకు వ్యతిరేకంగా మహిళలు ఎలా పాల్గొన్నారో తెలుస్తుంది. 'తెలంగాణా పోరాటం-అనుభవాలు' వేసిన ముద్ర కూడా అంతా ఇంతా కాదు. ఆ పోరాటంలో మహిళల పాత్ర లేకపోతే పోరాటం జయప్రదం కాకపోయేదని సుందరయ్యగారు స్వయంగా రాశారు. పార్టీ చెప్పిందని పసిపిల్లలను సైతం వదిలిపెట్టి తెలంగాణా పోరాటంలో పాల్గొన్న వీరనారులను మన మనోఫలకంపై ముద్ర వేస్తుందీ పుస్తకం. అలాగే ఉద్యమ నాయకులను కాపాడుకోవడం కోసం రకరకాల రూపాలను సృజనాత్మకంగా రూపొందించిన నాటి మహిళల గురించి తెలియచెప్పింది. ప్రధానంగా చెప్పుకోవాల్సిన పుస్తకం ఒకటుంది. అదే గోదావరి పరులేకర్ రచించిన 'వర్లీ ఆదివాసుల తిరుగుబాటు'. బాతు టబ్బుల్లో స్నానం చేసేంతటి ధనిక కుటుంబం గోదావరి పరులేకర్‌ది. టీ టిఫిన్‌తో ఉదయపు అల్పాహారం మొదలైతే రకరకాల కూరలు, గడ్డ పెరుగుతో భోజనం ముగుస్తుంది. అలాంటావిడ ఆదివాసీల కోసం, వారి బాగుకోసం వారి మధ్యే జీవించడానికి సిద్ధపడడం నాకు ఎంతగానో

వ్యవసాయ కార్మికసంఘం, రైతుసంఘం, మహిళాసంఘం...ఇలా ఏ సంఘంలో చేసినా 1977 నుంచి ఇవాళ్టి వరకు పార్టీతో వుండడానికి నేను చదివిన సాహిత్యం, సైద్ధాంతిక అధ్యయనమే కారణం. దీనికి బలరామయ్యగారి ప్రోత్సాహం ఎంతో వుంది. ఏ రంగంలో పనిచేసినా అన్ని రకాల ప్రజలతో మమేకం కావడానికి గోదావరి పరులేకర్ పుస్తకం ఎంతగానో ఉపయోగపడింది. అందుకే ఇప్పటికీ కార్యకర్తలకు చెప్తుంటాను ఆ పుస్తకాలు చదవమని.

స్ఫూర్తినిచ్చింది. కనీసం స్నానం చేయడానికి కూడా లేని ప్రదేశంలో ఆవిడ పనిచేశారని చదివితే ఆశ్చర్యపోతాం. పచ్చడి మెతుకులతోనే భోజనం. మురికి గుంటలలోనే స్నానం. తనకెంతో ఇష్టమైన టీ లేకపోయినా అక్కడే మకాం. పొట్టు తీయని గోధుమ పిండితో చేసిన రొట్టెలు తింటే నాలుక కోసుకుపోయేది. అయినా భూస్వాముల దోపిడీ నుంచి ఆదివాసులను విముక్తి చేయడానికి అక్కడే వుండిపోతుంది. ఆరోజుల్లోనే ఆమెను పట్టిస్తే పదివేల రూపాయలిస్తామని ప్రకటిస్తారు పోలీసులు. అయినా సరే ఎంతో అభిమానంగా 'అక్క' అని పిల్చుకునే గోదావరి పరులేకర్‌ను ఆ ఆదివాసీలు కాపాడుకుంటారు.

కూలిపోరాటాలు, భూపోరాటాల్లో పాల్గొన్నప్పుడు గోదావరి పరులేకర్ ఇచ్చిన స్ఫూర్తి నా వెంటే వున్నట్టనిపించింది. ఉద్యమాలను వెనక్కు కొట్టడానికి భూస్వాములు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. "వాళ్లు ఎక్కడినుంచో వచ్చి మిమ్మల్ని ... పురుడుకు, పెళ్లిళ్లకు, సాయం చేస్తాం. అవసరమైతే అప్పిస్తాం" అంటూ కొందరిని చీలిక తెచ్చే ప్రయత్నం చేశారు. దానికి వ్యతిరేకంగా కూడా పోరాటం చేయాల్సిన పరిస్థితి. కిష్టారావుపాలెం భూపోరాటం గురించి కొద్దిగా ప్రస్తావించాలి. ఆ ఊరి జమిందారుకు 45 ఎకరాల మామిడితోట మిగులుభూమిగా తేలడంతో లంబాడాలకు పంచమని పెద్ద పోరాటం చేశాం. అన్ని చోట్లా మహిళలను ఇన్వాల్వ్ చేశాం. అయితే ప్రభుత్వం మాత్రం ఆ జమిందారుకే వంత పాడింది. ఎకరాకి రూపాయి చొప్పున కవులుకిచ్చింది. దానికి వ్యతిరేకంగా కూడా పోరాడాం. ఎమ్మెల్యే రామయ్యగారు కూడా పాల్గొన్నారు. ఆయనతో పాటు పలువురు పేదలను అరెస్ట్ చేసింది. దాంతో వారి కుటుంబాలను కాపాడాల్సిన బాధ్యత మామీద పడింది. ఫండ్స్ వసూలు చేశాం. బియ్యం, డబ్బు సేకరించి అరెస్టయిన బీదల కుటుంబాలకు అందించి ఉద్యమాన్ని నిలబెట్టాం. ఆ సమయంలో మహిళా కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం దిగొచ్చి గిరిజన ప్రజలకు తలా అరెకరం చొప్పున పంపిణీ చేసింది. 1988లో 15 రోజుల పాటు వ్యవసాయ కూలిపోరాటంలో పాల్గొన్నా. ఆ సందర్భంగా వత్సవాయ గ్రామంలో ఓ ఎస్సీ కుటుంబంతో కలిసి వుండే అవకాశం వచ్చింది. ఆ జంటకు ఇద్దరు పిల్లలు. భూస్వామి దగ్గర అప్పు తీసుకున్న నేరానికి చిన్నారులను అక్కడే పనికి పెట్టారు. భర్త పెద్దపాలేరు. భార్య కూలికెళ్లేది. తండ్రీ పిల్లలు కలుసుకునే, ప్రేమగా మాట్లాడుకునే సందర్భాలే తక్కువ. వారి మధ్య తండ్రీకొడుకుల బంధాలు కూడా కరువైన పరిస్థితి. వాళ్ల తిండి చూస్తే ... బాధేసేది. మజ్జిగ, టీ అన్నదే వుండదు. ముతక బియ్యం, పచ్చడి. మహా వుంటే ఒక కూర లాంటిదేదైనా. ఇదే వారి ఆహారం. వర్షం పడితే కోళ్లను వారుండే ఒక్క గదిలోనే కప్పేస్తారు. ఒకటే వాసన, వంటిమీద పాకులాడే పేలు. ఇవన్నీ ఒక ఎత్తయితే...భూస్వాములు చేసే శ్రమ దోపిడీ మరో ఎత్తు. అక్కడ వుండడంతో వారి జీవన విధానం తెలిసే అవకాశం కలిగింది. ఇలా దోపిడీకి గురయ్యే వారిని పలుమార్లు సమావేశ పరిచి కూలిపోరాటాలకు సిద్ధం చేశాం. పట్టుదలతో చేసిన ఈ పోరాటం వల్ల కూలి 12 రూపాయల నుండి 25రూపాలయకు పెరిగింది. ఆ పోరాటాల్లో సాధించిన విజయాలు మర్చిపోలేనివి. జండర్ అంశాలమీద, మద్యనిషేధం కోరుతూ చేసిన ఉద్యమాలు మంచి స్ఫూర్తినిచ్చాయి. ఈ ఉద్యమాల సందర్భంగా ఎన్నో అనుభవాలు, మరెన్నో అనుభూతులు. మర్చిపోలేని సంఘటనలెన్నో. వాటిలో ఒకటి మాత్రం ఎప్పటికీ నా వెన్నంటే వుంటుంది. పార్టీలోకి వచ్చిన కొత్తలో ఓసారి నేను గిరిజనుల ఇంటికి భోజనానికెళ్లాను. అలా వారిళ్లల్లో తినడం అదే తొలిసారి. సత్తు పళ్లెంలో వారు తినేదే పెట్టారు. కానీ తినలేకపోయా. నోట్లో ముద్ద లోపలికి పోకుండా ముందుకే వచ్చింది. అప్పుడు గోదావరి పరులేకర్‌కు ఎదురైన అనుభవం గుర్తొచ్చింది. ఆ స్ఫూర్తితోనే ముందుకు సాగా.

వ్యవసాయ కార్మికసంఘం, రైతుసంఘం, మహిళాసంఘం...ఇలా ఏ సంఘంలో చేసినా 1977 నుంచి ఇవాల్టి వరకు పార్టీతో వుండడానికి నేను చదివిన సాహిత్యం, సైద్ధాంతిక అధ్యయనమే కారణం. దీనికి బలరామయ్యగారి ప్రోత్సాహం ఎంతో వుంది. ఏ రంగంలో పనిచేసినా అన్ని రకాల ప్రజలతో మమేకం కావడానికి గోదావరి పరులేకర్ పుస్తకం ఎంతగానో ఉపయోగపడింది. అందుకే ఇప్పటికీ కార్యకర్తలకు చెప్తుంటాను ఆ పుస్తకాలు చదవమని. ★

బాగా గురుతు



బాగా గురుతు
అయితారం అంగట్ల
నువు కొనిచ్చిన సీకులు,
సాహేబు దుక్నంల పిప్పరమెంట్లు తినుకుంట
గడిలోకెళ్ల మనమొస్తుంటే,
మంగలి నారాయణ, మాదిగ లచ్చయ్య
ఒరేయ్ 'ఎంకటేషు' అని పిలిస్తే
ఎగిరి గంతేసి ఉరికెటోన్ని.
జొన్న కంకుల్ని బెల్లంల కలిపి
ఆగమాగం మెక్కెటోన్ని.
పీర్ల పండుగ నాడు మైదాకు బెట్టుకోని
మునిమాపు యేళ అలయ్ బలయ్‌గా
మస్తుగ తిరిగెటోన్ని.

ఇయ్యాళ
పెద్ద సదువులు సదివి మళ్ల ఊరికి పోతె
ఎక్కడ జూసినా టీవీలు
వాటి ముందు మందలు మందలుగా జనం.
నేను పుట్టి పెరిగిన పల్లె
నాకే అన్‌జాన్ గొడుతున్నది.

మంగలి నారాయణ, మాదిగ లచ్చయ్య
'ఎంకటేషు' అని పిలవలేదు.
ఎండిపోయిన లంక చేనులా
ఎవరి మొగంలా కళ లేదు.

ఏమైంది నా ఊరికి?
ఎక్కడ పోయినయ్ అప్పటి ప్రేమలు.
నాకు మునుపటి నా ఊరు కావాలె.
గిదేదో మొగాలకు రంగులేసుకున్న
బాగోతంలా కనబడుతున్నది.
ఏం పెద్ద రోగమొచ్చిందో ఏమో!
ఎవడి దిష్టి తగిలిందో ఏమో!

అమ్మా!
అయితారం అంగట్ల సీకులు
సాహేబు దుక్నంల పిప్పరమెంట్లు మళ్ల తినాలనుంది.
మళ్ల చిన్న తనంలోకెళ్లి
పులికాట్ ఆట ఆడాలనుంది.

కన్నీటి జడివానలో...

కన్నీటి జడివానలో
తడిచిన యవ్వనం
పేపరు పడవ వలే
నీటిలో కొట్టుకుపోతున్నది!

అర్ధరాత్రి లేచాను
పక్కలో అన్ని శవాల గుంపులు
రక్తపు సంద్రాలు
చిత్రం! వాటి రంగు నలుపులో వుంది!

అధరాలు అమృతపాశాలై
నునులేత స్పర్శగా శరీరాన్ని
స్పృశించి కృశింపజేస్తున్నాయి!

బాల్యం ఒక మాయల మరారి
జీవితంలోని ఆనందం అంతా
అనుభవిస్తారని తొందరగా వెళ్లిపోతుంది!

ఆకలి చూపులు
కడుపు నిండిన ఈర్ష్యపు చూపులు
పరస్పరం పోరాడుతున్నాయి
చివరకు విజయం మాత్రం కన్నీటిదే!

ఇ. వెంకటేష్

ఏదో ఒక రాగం పిలిచింది వేళ...

పాటలు బాటలు... మారిన బీటులు

కాల నాళికలో పాటల పేటిక లోలోకి వెళితే 'కలకానిది విలువైనది బతుకు కన్నీటి ధారలలోనే బలి చేయకు' అని బరువైన పాట పాడుతున్నాడు కథానాయకుడు అక్కినేని(చెప్పాలంటే శ్రీశ్రీ రాసింది ఘంటసాల పాడుతున్నాడు) నాయిక సావిత్రి కోసం. కాని హాలులో వున్న ప్రేక్షకులే కాదు, దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా అమర సందేశంలా ఆ పాట ప్రతి హృదయాన్ని అలరిస్తూనే వుంది. 'పాడుతా తీయగా చల్లగా' అని పాడుతున్నాడు.. ఇప్పటికీ వింటున్న వారి హృదయాలు ఆర్ద్రం చేస్తూనే వుంది. 'కొండగాలి తిరిగింది గుండె వూసు లాడింది' అని ఎప్పుడో ఆరుద్ర పాట ఘంటసాల పాడితే ఇప్పటికి అది హృదయసీమలను ఆహ్లాదభరితం చేస్తూనే వుంది. 'పయనించే ఓ చిలుకా ఎగిరిపో పాడై పోయెను గూడు' అన్న పాటలో చిలుక ఇప్పటికీ ఎగురుతూనే వుంది. 'మనసున మల్లెల మాలలూగెనే' అని భానుమతి పాడిన పాట మల్లెలు పూయిస్తూనే వుంది. 'వినుడు వినుడు రామాయణ గాథ' అన్న లవకుశుల గానం.. 'పాతాళభైరవి'లో 'ఎంత ఘాటు ప్రేమయో' అన్న తోట రాముడి ఆలాపన.. 'వివాహ భోజనంబు' అన్న మాధవపెద్ది పాట విందు భోజనాలకు ప్రతీకగా మారిపోయింది. 'ఈ జీవన తరంగాలలో' అనగానే విషాద గాంభీర్యం.. 'జగమే మాయ' అనగానే భగ్న ప్రేమ తాగుబోతు.. ఇవన్నీ పాత పాటలనుకుంటే ఇటీవల.. 'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో..' ప్రతిఘటనలో వేటూరి పాట అత్యాచార భారతానికి అభిశంసనగా స్థిరపడిపోయింది. 'ముస్తఫా ముస్తఫా డోంట్ వరీ ముస్తఫా' కొంత కాలం కిందట కుర్రకారు నేస్తానికి నజరానాగా ప్రతిధ్వనించింది. 'ఏదో ఒక రాగం పిలిచిందీ వేళ. నాలో నిదురించే కథలన్నీ కదిలేలా..' రాజా పాట... 'అనగనగా ఆకాశంవుంది' నువ్వు సినిమాల కాలంలో ఒక ప్రతీక.. 'నేనుసైతం ప్రపంచాగ్నికి' మహాకవిని మళ్లీ మనసుల్లోకి తెచ్చి మన్నన పొందిన పాట. 'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది..' అంటూ అంధుల కోసం చంద్రబోసు రాసిన పాట.. ఇవన్నీ అప్పుడూ ఇప్పుడూ తెలుగు సినిమా పాటల ప్రస్థానానికి ప్రాభవానికి ప్రత్యక్ష నిదర్శనాలు. తాజాగా "పంచదార బొమ్మా" అన్నా, 'వేర్ ఈజ్ ద పంచకట్టు చారి' అన్నా, 'నమో నమో వెంకటేశా' అని పాడినా ఎన్నెన్నో వైవిధ్య వైభవాలు..

ఈ జాబితాను అలా వుంచితే పాటల చిత్రీకరణలోనూ సన్నివేశాలలోనూ వచ్చిన మార్పులేమిటి? అందుకు కారణాలేమిటి అని చూస్తే మొదటిది పాటలు కథలో భాగంగా పాత్రల పరంగా వుండటం అదృశ్యమైంది. మొదట్లో చెప్పుకున్న పాత పాటలన్నీ భక్తి గీతాలైనా రక్తి రాగాలైనా సన్నివేశంలో ఇమిడిపోయాయి. ప్రేమను ప్రకటించడానికి బాధను వ్యక్తీకరించడానికి లేదా ఎవరినో ఓదార్చడానికి తమాషాకు ఇలా సందర్భాలను బట్టి పాటలు, దాన్ని బట్టి సాహిత్యం, సన్నివేశం... అందుకే ప్రేక్షకుడు కూడా వాటిలో లీనమైపోవడం కద్దు. సంగీతం విషయంలో ఎప్పటికప్పుడు సంప్రదాయ పరికరాలతో పాటు పాశ్చాత్య బాణీలను కూడా మన వాళ్లు ఉపయోగిస్తూనే వున్నారు. కాకపోతే శ్రావ్యత అన్న దానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. శ్రావ్యత కీలకమైనప్పుడు సాహిత్య విలువలు పెరిగేవి. శ్రీశ్రీ మల్లాది ఆరుద్ర, ఆత్రేయ, పింగళి, దాశరథి, సినారె వంటి మహామహులు మహారథులు పాటలు కట్టేవారు. ఒక్కొక్కటి ఒక రసగుళిక..రాగ వల్లిక.. కథాంశం వాటికి తోడుండడం వల్ల ప్రేక్షకులపై బలమైన ముద్ర వేసేవి కూడా. పాటలలో కూడా పాత్రధారులు లేదా సహాయనటులు బృందాలు మాత్రమే వుండేవారు. అప్పుడప్పుడు కలలు కన్నా చందమామ వంటి వాటికే పరిమితమై వుండేవి.

తర్వాత నెమ్మదిగా ఈ స్థితి మారింది. పాటలు అనగానే ఎక్కడికో పోవడం.. వరుసగా డ్రస్సులు మార్చడం పెరిగింది.రంగులు వచ్చాక ఇంకా ఎక్కువైంది. డ్రస్సులు మార్చడం కొత్త కొత్త ప్రదేశాలు చూపించడం అంటే వాస్తవ సన్నివేశం సాధ్యం కాదు. కలలు పెరిగాయి. అలా ప్రేమ పాట్యం పాటల రూపం మొదట మారింది. దీనికి ఇతర సాంకేతిక మార్పులు తోడైనాయి. రంగుల సినిమా వచ్చాక అంత ఖర్చు పెట్టి ఇద్దరినే చూపిస్తే గిట్టుబాటు కాదు గనక తెరపై ఎక్కువ మంది కనిపించాలి. వాళ్లంతా ఎలా వస్తారు? కనక అది కూడా కలల విస్తరణకు కారణమైంది(మామూలుగానే పాటల్లో వినిపించే సంగీత వాయిద్యాలు కనిపించవు కాని భారతీయ సంగీత చరిత్ర దృష్ట్యా ప్రేక్షకులు దాన్ని పట్టించుకోలేదు). ఒకసారి కలలు అనుకున్నాక ఏది పడితే అది ఎక్కడ పడితే అక్కడ చూపించడం మామూలై పోయింది. విదేశీ ప్రదేశాలు వచ్చేశాయి...

ఈలోగా సినిమాలు మారాయి. బరువైన కథలు తగ్గి దారపోగులాటి తేలికైన పాయింట్లతో సినిమాలు లాగించడం ఎక్కువైంది. ఇందులో పాత్రలు పాత్రల సంబంధాలు వంటివాటికి పెద్ద విలువ లేకుండా పోయింది. హీరోలు వారి కుమార రత్నాలైన కుర్ర హీరోల చుట్టూ తిప్పాలి.. కథ తక్కువ కథనం ఎక్కువ.. ఇంక సన్నివేశ సంబంధమైన సందర్భమైన పాటలెక్కడ? సాంకేతికంగానూ సంగీతంలో మార్పులు విపరీతంగా వచ్చేశాయి. మిక్సింగు, రీ మిక్సింగు సదుపాయాలు వచ్చాక సాహిత్యం లేదా శ్రావ్యత చూసుకునే కంటే ఆధునిక ఆర్కెస్ట్రా హోరుతో సరిపెట్టడం రివాజైంది. మంచి పేరున్న సంగీత దర్శకుణ్ణి పట్టుకుని ముందే బీటు సిద్ధం చేసి ఏవో ఉత్తుత్తి పదాలతో పాట కట్టామనిపిస్తారు. తర్వాత వాటిని భర్తీ చేయడమే కవిగారి కర్తవ్యం. ఆ హోరులో మాటల పొందిక పొహళింపు ఎలాగూ అర్థం కావు. ఈ విధంగా మృదు మధురమైన తెలుగు సినిమా పాట కాస్తా మహా సంభరితమై పోయింది.

తమాషా ఏమంటే ఆడియో రిలీజ్ అమ్మకాలు గతంలో కంటే ఇప్పుడు పెద్ద మార్కెట్‌గానూ ప్రచారంగానూ వున్నాయి. వాటిని జనం వినేందుకు కొత్త కొత్త సాధనాలు వచ్చాయి. ఐపాడ్‌లు సెల్‌ఫోన్లు అన్నింటిలోనూ పాటలు ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. ఇప్పటికి మంచి పాటల కోసం జనం చెవి కోసుకుంటూనే వున్నారు. ఇప్పటి కవులు కూడా అడపా దడపా మంచి పాటలు అందిస్తూనే వున్నారు. కాకుంటే మారిన సాంస్కృతిక సాంకేతిక సందర్భంలో పాటల బాటలే మారిపోయాయి. ప్రతిఘటన దర్శకుడు టి.కృష్ణ కథ చెబుతుంటే వేటూరి ఇక్కడో మంచి పాట వస్తుంది బాబూ రాస్తాను అన్నాడట. దుర్యోధన దుశ్శాసన అన్న పాట అలా పుట్టిందే. కనక బలమైన పాటలు రావాలంటే బలమైన సన్నివేశాలు అభిరుచి గల దర్శక నిర్మాతలు, హీరోలు వుంటేనే సాధ్యం. అలాటి వారి చిత్రాల్లో ఇప్పటికీ మంచి పాటలు వస్తూనే వున్నాయి గాని బాగా తక్కువ. మిగిలినవన్నీ మొదట చెప్పుకున్న శబ్ద తరంగాలే.

-తెర

కథ

ఖైదీ

హిందీ మూలం : సుషమా మునీంద్ర
అనువాదం : ఆర్.శాంతసుందరి

చాలా కాలం తరువాత సాజన్ నామ్‌దేవ్ దగ్గరినుంచి ఉత్తరం వచ్చింది. ఈ సారి దానిమీద జైలువాళ్ల స్టాంపు లేదు. అంటే తను విడుదలై ఇంటికి వెళ్లి ఉంటాడు అనుకుంటూ పూర్ణ ఉత్తరం చదవసాగింది.

పూర్ణ ఒక రచయిత్రి. పాఠకుల దగ్గరినుంచి ఆమెకి ఉత్తరాలు రావడం మామూలే. కానీ ఆరేడేళ్లక్రితం ఆమెకి ఒక విచిత్రమైన కార్డు వచ్చింది. అది ఒక ఖైదీ రాసింది. ఏదో పత్రికలో మహిళా ఖైదీల గురించి పూర్ణ రాసిన కథ చదివి అతనామెకి ఉత్తరం రాశాడు. కొందరు దయగల సంపాదకులు ఖైదీలకోసం ఉచితంగా తమ పత్రికలు పంపిస్తారనీ, ఒక పత్రికలో పూర్ణ కథ చదివి తను చలించిపోయాడనీ రాశాడు. ఆ కార్డు మీద సెంట్రల్ జైలు సీలూ, అడ్రసూ ఉన్నాయి.

ఒక ఖైదీకి అంత సాహిత్యాభిలాష ఉండడం చూసి పూర్ణ ఆశ్చర్యపోయింది. పూర్ణ అతనికి జవాబు రాసి పోస్టు చేసింది. దాంతో సాజన్‌కి ఉత్సాహం వచ్చి తన గురించి వివరంగా ఆమెకి మళ్లీ ఒక ఇన్‌లాండు కవర్ రాశాడు. 'మీ లాంటి వాళ్లు రాసే కథలు మాలాటి ఖైదీలకు ఎంతో ఊరటనీ, ధైర్యాన్నీ ఇస్తాయి. నేను ఇంటర్ పాసయిన ఒక మామూలు మనిషిని. భివండీలో నేనూ మా అన్నా ఒక పాన్‌షాప్ నడిపేవాళ్లం. మా కొట్టు విషయంలో ఒక వ్యక్తికీ, మాకూ తరచు తగాదా జరుగుతుండేది. ఒకసారి మా గొడవ కొట్లాటగా మారింది. నేను కొట్టిన దెబ్బ తగలరాని చోట తగిలి అతను చనిపోయాడు. నేను చంపాలని అనుకోలేదు, ప్రమాదవశాత్తూ అలా జరిగింది. నాకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. అప్పుడు నాకు ఇరవైరెండేళ్లు. నాకు అప్పటికి పెళ్లి కాలేదు. కుటుంబం అని చెప్పుకునేందుకు అన్నా, వదినా, వాళ్ల పిల్లలూ మాత్రమే ఉన్నారు నాకు' అని రాశాడు.

పూర్ణకు అతని మీద జాలేసింది. కలలు కనే వయసులో పాపం అతను జైలుపాలయ్యాడు. పద్నాలుగేళ్ల తరువాత, బయటికొచ్చాక, ఇక అతనికి కలలూ, ఆశలూ ఏవీ మిగిలి ఉండవు. పూర్ణ జవాబు రాయకుండా ఉండలేకపోయింది. 'అపరాధాన్ని ఒప్పుకున్న మీరు చాలా మంచి మనిషని అనాలి. జరిగిందానికి విచారించకండి. బయటికొచ్చాక సమాజానికి ఉపయోగపడుతూ, మంచి మనిషిగా పేరు తెచ్చుకోండి. నిరాశ పడొద్దు. నా దగ్గర ఉన్నవి ధైర్యం చెప్పే మాటలు మాత్రమే, అవే మీకు నేను ఇవ్వగలను. మీ మనసునీ, ఆశలనూ నిర్మలంగా ఉంచుకుంటారని నమ్ముతున్నాను'.

దానికి జవాబుగా సాజన్ ఆమెకి జైలు జీవితం గురించీ, నేటి ఖైదీల గురించీ చాలా పెద్ద ఉత్తరం రాశాడు. పూర్ణని ఆకాశానికెత్తేశాడు. అంత పెద్ద రచయిత్రి అయి ఉండి తనకు ఉత్తరాలు రాస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపాడు. పూర్ణ రచనలు చదివాక తన ఆలోచనల్లో చాలా పెద్ద మార్పు వచ్చిందని రాశాడు.

ఇంట్లో భర్త గాని, కూతుళ్లు గాని పూర్ణ రచనలను పెద్దగా పట్టించుకోరు. వాటిని చదవాలన్న ఆసక్తి కూడా వాళ్లకు ఉండదు. భర్త ఎప్పుడూ ఢిల్లీలోనే ఉంటాడు. ఆయనకు రాజకీయాల్లో ఆసక్తి. కూతుళ్లకు ఇరవైనాలుగ్గంటలూ చదువుతోనే సరిపోతుంది. ఇలా తరచూ సాజన్ రాసే ఉత్తరాల వల్ల పూర్ణ మనసులో ఇక ఎప్పుడూ అతన్ని గురించిన ఆలోచనలే ఉంటూ ఉండేవి.

మానవహక్కుల దినం రోజున పూర్ణ ఒక సభలో చాలా సేపు మాట్లాడుతుంది. సాజన్ పేరు చెప్పకుండా అతను రాసే ఉత్తరాల గురించి చెప్పింది. అతను జైల్లో మిగతా ఖైదీలకు కూడా సాహిత్యంలో ఆసక్తి కలిగిస్తున్నాడనీ, అతనికి జీవించే కళ పట్టుబడిందనీ, ఖైదీలలో మార్పు వస్తే వాళ్లు కూడా జనజీవంలో కలిసిపోయి మంచి పౌరులుగా బతకగలుగుతారనీ, ఇంకా సిద్ధాంతాలు, ఆదర్శాలు, పురోగతి, మానవసంబంధాలను అర్థం చేసుకోవడం లాటి పెద్ద పెద్ద విషయాల గురించి మాట్లాడేసరికి సభ చప్పట్లతో దద్దరిల్లింది.

తరువాత పూర్ణ, సాజన్ ఉత్తరాలకోసం ఎదురుచూడడం మొదలు పెట్టింది. మధ్యలో ఒకసారి తన శిక్షాకాలం పూర్తికావస్తోందనీ, పెరోల్ మీద భివండీకి వెళ్లాననీ, తనను సెంట్రల్ జైలు నుంచి మరో ఓపెన్ జైలులోకి మార్చారనీ, 'మీరు ఇలాగే నా మీద ఆప్యాయత చూపిస్తుంటే నా మిగతా సమయం సుఖంగా గడిచిపోతుంది' అనీ రాశాడు.

ఆ ఉత్తరం చదివాక పూర్ణ మనసులో రకరకాల ఆలోచనలు తలెత్తసాగాయి. అసలు జైల్లో ఉంటే ఖైదీలందరూ నేరస్థులేనా? ఒక వేళ అలా ఐతే, ఆ నేరానికి కారణాలేంటి? ఒకసారి జైల్లో ఉండివచ్చాక వాళ్లను సమాజం తమతో ఎందుకు కలుపుకోదు? వాళ్లు మారి, మంచి మనుషులుగా ప్రవర్తించడం మొదలు పెట్టినా, ఎవరూ వాళ్లనెందుకు నమ్మరు? అసలు జైల్లో ఖైదీల జీవితం ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకునేందుకు ఎవరైనా ప్రయత్నిస్తారా? ఎందుకు ప్రయత్నించరు?

ఆ తరువాత పూర్ణకి సాజన్ దగ్గరినుంచి ఇంకో ఉత్తరం వచ్చింది.

మేడమ్ గారూ,

శిక్ష పూర్తయి ఇంటికి వస్తున్నాను. అందరూ నన్ను ఎలా ఆదరిస్తారో తెలీదు. మీరు మట్టుకు

నాకు చాలా సాయం చేశారు. మీ సాయం, భరోసా నేను మళ్లీ ఒక మనిషిగా బతికేందుకు తోడ్పడుతుందనుకుంటాను...'

మళ్లీ ఇవాళ ఈ పోస్ట్ కార్డు వచ్చింది అతని దగ్గరినుంచి.

'మేడమ్ గారూ,

మీకు బహుశా నేనొక స్వార్థపరుడిననీ, జైలు నుంచి బయటికొచ్చాక మిమ్మల్ని మర్చిపోయాననీ అనుకుంటూ ఉండొచ్చు. కానీ అది నిజం కాదు. నేను మిమ్మల్ని ఎన్నటికీ మర్చిపోను. ఒక పెళ్లికి మీ ఊరు దగ్గర్లో ఉండే ఊరికి వస్తున్నాను. నేను మీ దర్శనం చేసుకోవడానికి వస్తున్నాను...'

పూర్ణ ఈ విషయం భర్తకీ, పిల్లలకూ చెప్పింది. అంతే ఒక్కొక్కళ్లూ అభ్యంతరం చెప్పడం మొదలు పెట్టారు. "అమ్మా ఒక ఖైదీ నిన్ను కలవడానికి రావడమా? ఊహూ వద్దు! ముక్కూమొహం తెలీని ఆ ఖైదీని ఇంట్లోకి రానిస్తావా?'

"చూడమ్మా అతన్ని ఖైదీ అనొద్దు. అతనికి ఒక పేరుంది" అంది పూర్ణ.

"పూర్ణా, ఖైదీని ఖైదీ అనక ఇంకేమంటారు? అనవసరంగా నా ఇంటికి ఎవరూ రావడం ఇష్టం ఉండదు. నేనెప్పుడూ ఇంట్లో ఉండను. వయసులో ఉన్న ఇద్దరు ఆడపిల్లలున్నారు మనకు. ఆ ఖైదీ ఎటువంటివాడో అతని గతం ఎలాంటిదో, చేసిన నేరం ఏమిటో మనకు తెలీదు. నువ్వే అనవసరంగా పరిచయం పెంచుకుని ఇంటికొచ్చేట్టు చేసుకున్నావు. అతని గురించి నీకసలేం తెలుసు? " అన్నాడు భర్త.

"అతను ఉత్తరాల్లో అంతా రాశాడు కదండీ?"

"అంటే అతను రాసినదంతా నమ్మడమేనా? నేరస్థుడు ఎప్పుడన్నా తను చేసిన నేరాన్ని ఒప్పుకుంటాడా? అసలతను మనింటికి రావడం ఎందుకు?"

"నన్ను కలవాలని, ఇంకెందుకు?"

"ఏపనీ లేనిదే ఈ రోజుల్లో ఎవరూ ఎవర్నీ కలవడంలేదు.

వెళ్తున్నవాడల్లా ఆగి ఒక ప్యాకెట్టు జేబులోంచి తీసి, "మేడమ్ ఈ చిన్న వస్తువు మీ కోసం, నచ్చుతుందోలేదో, ఏదో నా బుద్ధికి తోచింది తెచ్చాను" అనేసి అతను బయటికెళ్లిపోయాడు. ఆవిడ ఆ ప్యాకెట్ అందుకోబోయేసరికి బల్లమీద పెట్టి వెళ్లిపోయాడు.

నన్ను గురించి సాజన్ ఏమనుకుంటాడు? తన లాటి వాళ్ల జీవితాలను కథావస్తువుగా తీసుకుని గొప్పగొప్ప రచనలు చేసే నేను, నిజంగా అటువంటి వ్యక్తి ఎదురైతే, మొహం చాటేస్తాననీ, నేనొక రెండు నాలుకల మనిషిననీ అనుకుంటాడా?

పట్టపగలే దొంగతనాలూ, మర్డర్లూ జరుగుతున్నాయి. మనసులో ఏ దురుద్దేశంతో వస్తున్నాడో?"

పూర్ణ కూడా ఇక అనుమానించసాగింది. పిల్లలూ, మొగుడూ బాగా భయపెట్టేసరికి ఆమెకి నిజంగానే హడలు పుట్టింది. ఎటూ తేల్చుకోలేక ఆలోచనలతో కొట్టుమిట్టాడింది.

భర్త ఢిల్లీ వెళ్తూ, 'పూర్ణా, అతనికి ఉత్తరం రాయి. నువ్వొచ్చే సమయానికి నేను ఊళ్లో ఉండడం లేదు, అని రాయి" అన్నాడు.

పూర్ణ ఆలోచనల్లోంచి పూర్తిగా తేరుకోలేకముందే ఒకరోజు మధ్యాహ్నం ఇంట్లో పూర్ణ ఒక్కతే ఉన్న సమయంలో సాజన్ వచ్చాడు. బెల్ మోగగానే పూర్ణ తలుపు తీసింది. గ్రిల్‌డోర్ బయట నిల్చున్న సాజన్ నమస్కారం పెట్టాడు. కొన్ని నిమిషాల పాటు పూర్ణ గ్రిల్‌డోర్ తియ్యకుండా బొమ్మలా నిలబడే ఉండిపోయింది.

"మీరు మేడమ్ గారే కదా? నేను, సాజన్ నామ్‌దేవ్‌ని... నాసిక్ జైల్లో ..."

"ఆ.. ఆ.. రండి..." అంటూ తలుపు తెరిచింది. నా జీవితాన్ని మంచి దారిలో పెట్టిన మిమ్మల్ని ఎప్పుడు చూస్తానా అని చాలా తొందరగా ఉండేది. మిమ్మల్ని చూసేందుకే ఇంత దూరం వచ్చాను" అన్నాడతను.

"ఓ, అలాగా? కూర్చోండి..." అంటూ పూర్ణ అతన్ని లోపలకు రమ్మనకుండా వరండాలో ఉన్న ... కుర్చీలో కూర్చోపెట్టింది.

మంచి ఎండలో వచ్చాడు, మంచినీళ్లివ్వాలి, కానీ తన వెనకాలే అతను లోపలకు వచ్చి నన్నేమైనా చెయ్యడు కదా! తనేమో అంత ఇంట్లో ఒక్కతే ఉంది. అతనేమో హత్య చేసి జైలుకెళ్లినవాడు! అనుకుంటూ అక్కడే నిలబడిపోయిందామె.

మహారాష్ట్ర నుంచి మధ్యప్రదేశ్‌కి కేవలం ఆమెని చూసి కృతజ్ఞతలు చెప్పుకునేందుకు వచ్చాడు సాజన్. ఉత్తరాల్లో దొరికిన ఆత్మీయతే ప్రత్యక్షంగా కూడా దొరుకుతుందన్న ఆశతో వచ్చాడు. కానీ పూర్ణ ధోరణి చూస్తే మరోలా ఉంది. "మేడమ్ గారూ! నేను వచ్చి మీకేమీ ఇబ్బంది కలిగించలేదు కదా? " అన్నాడు.

"లేదు లేదు, మిమ్మల్ని కలుసుకోవడం నాకు కూడా బావుంది" అందామె ముక్తసరిగా.

మీరే కనక నాకు ధైర్యం చెప్పి ఉండకపోతే ఈ రోజు నేనీ స్థితికి వచ్చేవాణ్ణి కాను, అని ఏమిటేమిటో చెబుతున్నాడతను. కానీ పూర్ణకి గుండె దడ తగ్గలేదు. వరండాలోంచి కదలడానికి భయపడసాగింది. చివరికి గొంతుపెగుల్చుకుని, "ప్రస్తుతం ఏం చేస్తున్నారు?" అని అడిగింది.

"అన్నయ్య, వదినలతోనే ఉంటున్నాను. పాన్ షాపుతో బాటు సమోసాల దుకాణం తెరిచాడు అన్నయ్య. వాళ్లిద్దరికీ వీలైనంత సాయం చేస్తున్నాను"

"అయితే బావున్నారన్నమాట!" అంది. అంతే ఆ పైన మాటలు కరువైనాయి.

"అయితే మేడమ్ నేనింక వెళ్తాను. మిమ్మల్ని చూశాను, సంతోషం!"

"అరె, ఏమీ తీసుకోకుండానే?" అందామె మర్యాదకి.

"మరోసారి చూద్దాం. ఇక నాకు సెలవిప్పించండి" అంటూ చాలా నిరాశగా వెనుతిరిగాడు. వచ్చినప్పుడున్న ఉత్సాహమంతా చల్లారిపోయింది.

పూర్ణ బాగా పేరున్న రచయిత్రి. సమాజాన్ని బాగు చెయ్యాలనుకుని ఎన్నో గొప్పరచనలు చేసింది. ఆ రచనల్లో ఆవిడ వెలిబుచ్చిన భావాలేవీ ఆవిడ ప్రవర్తనలో సాజన్‌కి కనిపించలేదు. సరిగ్గా మాట్లాడనుకూడా లేదు, ఆవిడ.

వెళ్తున్నవాడల్లా ఆగి ఒక ప్యాకెట్టు జేబులోంచి తీసి, "మేడమ్ ఈ చిన్న వస్తువు మీ కోసం, నచ్చుతుందోలేదో, ఏదో నా బుద్ధికి తోచింది తెచ్చాను" అనేసి అతను బయటికెళ్లిపోయాడు. ఆవిడ ఆ ప్యాకెట్ అందుకోబోయేసరికి బల్లమీద పెట్టి వెళ్లిపోయాడు.

నన్ను గురించి సాజన్ ఏమనుకుంటాడు? తన లాటి వాళ్ల జీవితాలను కథావస్తువుగా తీసుకుని గొప్పగొప్ప రచనలు చేసే నేను, నిజంగా అటువంటి వ్యక్తి ఎదురైతే, మొహం చాటేస్తాననీ, నేనొక రెండు నాలుకల మనిషిననీ అనుకుంటాడా?

పూర్ణ దృష్టి బల్లమీదున్న ప్యాకెట్ మీద పడింది. ప్యాకెట్ విప్పి చూసింది. లోపల ఒక పెన్ను, కాస్త ఖరీదైనదే, అంటే సాజన్ లాటివాడికి. అందులో ఒక చిన్న చీటీ ఉంది. "రచయితకు ఇంతకన్నా ఏమివ్వాలో నాకు తెలీలేదు" అని ఉంది.

పూర్ణకి తనమీద తనకే అసహ్యం వేసింది. ఎంతో గౌరవంతో, శ్రమ తీసుకుని, కానుక కూడా కొనుక్కుని వచ్చిన ఒక అభిమానికి తానిచ్చిన స్వాగతం ఎంత ఘోరంగా ఉందో అని అనుకోగానే ఆమెకి నీరసం ముంచుకొచ్చింది. సాజన్ ఖాళీ చేసి వెళ్లిన కుర్చీలో కూలబడిపోయింది.

★

వివాహం చేసుకోండయా! వాయనం అందుకోండయా!!



హాలీవుడ్ నటి జెన్నిఫర్ లోపెజ్ 2001లో తన నృత్య సహాయకుడు క్రిస్ జుడ్‌ను రెండవ వివాహం చేసుకుంది. ఎనిమిది నెలలకే పనికిరావు పొమ్మంది. లీసా మేరీ-నికోలాస్ కేజ్ 2002 అగస్టులో వివాహం చేసుకొని నవంబరులో కేవలం మూడునెలల 15 రోజుల్లోనే విడాకులు తీసుకున్నారు. రీనె-కెన్నీ జంట 2005 మేనెలలో వివాహం చేసుకొని సెప్టెంబరులో 'ఛా పో' అంటే 'ఛీ పో' అనుకున్నారు. డ్రూ బెర్రీ మోర్ అనే అమ్మడు మందుకొట్టటానికి బార్‌కు వచ్చి ఏకంగా ఓనర్‌ను పెళ్లి చేసుకొని నిషా దిగగానే నెలరోజుల్లోపే బై బై చెప్పింది. ఇక కుర్రకారును ఉర్రూతలూగించిన బ్రిట్నీ స్పియర్స్ తన చిన్న నాటి స్నేహితుడు జాసన్ అలెగ్జాండర్‌తో తనకు వెంటనే పెళ్లిచేయాలని పట్టుపట్టి లాస్‌వేగాస్‌లో తెల్లవారు ఝామున ఒక చర్చిలో పెళ్లి చేసుకుంది. కేవలం 15 నిమిషాలే జాసన్ భర్తగా ఉన్నాడు. పెళ్లయిన 55 గంటల్లోనే తన చర్యలను తన భర్త అర్థం చేసుకోలేకపోయాడంటూ బ్రిట్నీ విడాకులిచ్చేసింది. వీరంతా తారాలోకంలో ఎంతో పేరు మోసినవారు.

అమెరికా అంటే అర్రులు చాచే జనం కోకొల్లలు. ఎందుకంటే అక్కడ అపరిమితమైన డాలర్లను సంపాదించుకోవచ్చన్నదే పైకి చెప్పుకోలేని ప్రధాన కారణం. అమెరికా చరిత్రలో ఏ పేజీని తిరగేసినా సంపదలు, డబ్బు సంపాదించేందుకు ఐరోపానుంచి వలసవెళ్లినవారి దుర్మార్గాలే కనిపిస్తాయి. వర్తమాన చరిత్ర కూడా అదే. అమెరికన్లు ప్రపంచ సంపదలను ఆక్రమించుకొనేందుకు ప్రపంచంలో ప్రతిక్షణం ఎక్కడో అక్కడ దాడి చేస్తూ, ఉద్రిక్తతలను సృష్టిస్తున్నారు. డబ్బుకోసం ఏ గడ్డి అయినా కరవొచ్చు, ఎంతదుర్మార్గానికైనా పాల్పడవచ్చు అన్న భావనలను తలకెక్కించిన అక్కడి పాలకులు యావత్ సమాజాన్ని అన్ని విధాలుగా గబ్బుపట్టించారు. అభ్యుదయానికిగాక క్షీణ సంస్కృతికి ప్రతిబింబంగా ప్రపంచంలో తయారైంది. దాంపత్య ద్రోహాన్ని అమెరికన్లు తీవ్రంగా పరిగణిస్తారు. అందుకే బిల్‌క్లింటన్ అధ్యక్ష పదవిలో ఉండి తన కూతురు వయస్సున్న మోనికా లెవిన్‌స్కీతో సంబంధం పెట్టుకోవటం పెద్ద వివాదానికి దారితీసింది. ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. మరోవైపు.......

కాలిఫోర్నియాలో తొమ్మిదివేల మంది విద్యార్థులున్న కె-8 జిల్లాలో ఒక పుస్తకం విద్యార్థుల చేతుల్లో ఉండకూడదని ప్రభుత్వం జనవరి చివరివారంలో నిషేధించింది. పిల్లలనుంచి వాటి కాపీలను స్వాధీనం చేసుకున్నారు. మేరీకి ఇద్దరు అమ్మలు, జాన్‌కు ముగ్గురు నాన్నలు వంటి బూతుపుస్తకాలైతే మనం చెప్పుకోవాల్సిన పనిలేదు. ప్రపంచం అంతటా వినియోగించే మెరియం-వెబ్‌స్టర్ డిక్షనరీ కావటంతోనే చిక్కొచ్చి పడింది. ఎందుకటా దానిలో ఉన్న ఒక పదం 'ఓరల్ సెక్స్' అంటే ఏమిటని ఎలిమెంటరీ స్కూలు కుర్రాడు, కుర్రది అడిగితే ఏం చెప్పాలో తెలియని దురవస్థను ఎదుర్కొంటున్నామని ఓక్‌మెడోస్ అనే స్కూలు విద్యార్థి తండ్రి ఒకరు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాడట. అలాంటి అసహజమైన బూతు సినిమాలు తీయటానికి, బొమ్మలతో ఉన్న పుస్తకాలు ముద్రించటానికి మాత్రం అక్కడ ఎలాంటి అభ్యంతరమూ ఉండదు. వాటిని ప్రపంచం మీదకు వదిలి సొమ్ము చేసుకోవటం కూడా సర్కార్‌కు ఎలాంటి అభ్యంతరకరంగా కనిపించదు. ముందు డిక్షనరీలనైతే ప్రభుత్వం ఉపసంహరించిందిగాని వాటిని బయటదొరక్కుండా చేయలేదు కదా! అందుకే తల్లిదండ్రుల అనుమతి ఉంటేనే ఆ డిక్షనరీలను విద్యార్థులకు అందుబాటులోకి ఉంచుతామని తరువాత నిషేధాన్ని సవరించింది. అసలు ఓరల్ సెక్సంటే తెలియని పిల్లలు బహుతక్కువ, ఈ ఉదంతంతో వారు కూడా తెలుసుకుంటారని ఒక విద్యాశాఖాధికారిణి వ్యాఖ్యానించారు.

ఇంతకంటే నమ్మలేని ఉదంతం మరొకటి జరిగింది. మీ స్వేచ్ఛకు మాకు అభ్యంతరం లేదు. హాస్టల్ రూముల్లోకి అబ్బాయిలు అమ్మాయిలను, అమ్మాయిలు అబ్బాయిలను ఆహ్వానించుకోండి, మీ శృంగారం మీ ఇష్టం అందుకు మేం వద్దనటం లేదుగా, రూములను శుభ్రపరిచేందుకు సిబ్బంది వచ్చినా, రూమ్మేటు మేలుకొని ఉన్నా, మూడో వ్యక్తి(మరో విద్యార్థి) ఉన్నాడన్న ధ్యాసే లేకుండా వ్యవహరించటమే బాగాలేదు. కనీసం కాసేపు బయటకు వెళ్లరాబాబూ అని చాలా మంది అడగటం కూడా లేదు. ఇటీవల మరో విద్యార్థితో కలిసి ఉండటానికి ఎవరూ సిద్ధపడటం లేదు. అలా ఎవరినైనా జూనియర్ విద్యార్థులను కేటాయిస్తే సీనియర్లు విశృంఖలంగా వ్యవహరించి బయటికిపోక చస్తారా అని సెక్సును కూడా ఒక ఆయుధంగా వినియోగిస్తున్నారని టఫ్ట్ విశ్వవిద్యాలయం ఇటీవల అలాంటి శృంగారాన్ని నిషేధించింది. మా రోజుల్లో కూడా ఇలాంటివి ఉండేవి. అయితే మరుసటి రోజు పొద్దున్నే నా రూమ్మేటు మొహం చూడాలి......అదే ఇప్పుడు మనమే అలాంటి వారిని చూసేందుకు సిగ్గుపడాల్సిన స్థితి ఏర్పడింది అని విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు చెబుతున్నారు.

దొంగభక్తులకు పంగనామాలెక్కువ. నైతిక విలువలు నానాటికీ దిగజారుతున్న కొద్దీ అమెరికా మితవాదశక్తులు మరింతగా రెచ్చిపోతున్నారు. రంకు బొంకులను తీవ్రంగా పరిగణిస్తున్నారు. భార్యాభర్తలు పరస్పరం విశ్వాసంగా ఉండాలని శాసిస్తున్నారు. అదే సమయంలో దాంపత్యద్రోహానికి పాల్పడినట్లు అంగీకరిస్తున్నవారి సంఖ్య ఏడాదికేడాదికీ పెరుగుతోందని క్రిస్టియన్ సైన్స్ మానిటర్ పత్రిక వ్యాఖ్యాత వాపోయారు. సమాజంలో అందరూ క్రైస్తవులే, నీతి నియమాలను అందరూ చెప్పేవారే కానీ విలువలు నానాటికీ ఎందుకు పతనమౌతున్నాయని ప్రశ్నిస్తున్నారు. దాంపత్యద్రోహం ఘోరమైన తప్పిదం అని 1991లో 73.4శాతం మంది చెబితే 2006లో 80.6శాతానికి పెరిగిందట. ఇదే కాలంలో 35 సంవత్సరాలలోపు వారిని ప్రశ్నించగా మాకు రంకు సంబంధాలున్నాయని చెప్పిన వారి సంఖ్య పురుషుల్లో 15 నుంచి 20కి, యువతుల్లో 12 నుంచి 15శాతానికి పెరిగిందని వాషింగ్టన్ విశ్వవిద్యాలయం సర్వే వెల్లడించింది. బూతు బొమ్మలు చూసేందుకు, బూతు మాటల ఛాటింగుకు ఇంటర్నెట్ బాగా వినియోగపడటం కూడా యువతరంలో దాంపత్యద్రోహాలు పెరగటానికి ఒక కారణంగా పరిశోధకులు చెప్పారు. పెళ్లికి ముందు సెక్స్ సంబంధాలు తప్పుకానపుడు పెళ్లి తరువాత ఒకానొక బలహీన క్షణానికి లొంగిపోతే అది దాంపత్యద్రోహం ఎలా అవుతుందని కూడా కొందరు ప్రశ్నిస్తున్నారట. ఇలాంటి సంబంధాలను సమర్థించే వెబ్‌సైట్లు కూడా పుట్టుకు వచ్చాయి. పదేళ్ల క్రితం ఇలాంటి కారణంతో విడిపోయిన ఒక జంట ఈ సైట్‌ను నిర్వహించటం విశేషం. అనేక ఐరోపా దేశాలతో పోల్చితే అమెరికాలో వివాహం, వివాహ బంధం పవిత్రత గురించి ఎక్కువగా చెప్పుకుంటారు. వివాహం చేసుకోండయా, వాయనం అందుకోండయా అంటూ అమెరికా ప్రభుత్వం ప్రతి ఏటా పదికోట్ల డాలర్లను ఖర్చు చేస్తున్నది.

- సత్య

క్రైమ్ కథ

ఆస్తికోసం...

- యర్నాగుల సుధాకరరావు

రవిరాజ్ రింగ్ అవుతున్న సెల్ టేబిల్మీద పెట్టేసాడు. సెల్కాలర్లో చూస్తే అనిల్ అని ఉంది.అధికారి నవ్వేసి "ఈసెల్ రింగ్ ఆగాక నీసెల్కూడ మోగుతుంది అదీ అనిల్నుంచి వస్తుంది. ఎందుకంటే వాడిని మనపోలీసులు అరెస్టు చేయడానికి వెళ్లారు. ఆ అనిల్, పోలీసులకు బాగా ముట్టచెప్పేరకం కదా. అరెస్టు చేయడానికి వెళ్లినవారికి ఏదో ఆశచూపి ఇలా మీకు చేశాడు."

"హత్య జరిగి ఇప్పటికి నాలుగు మాసాలు అయ్యింది. ఇంతవరకు హత్యచేసింది ఎవరో మనకి తెలియలేదు. అలా అని మనం చేతులు ముడుచుకుని కూర్చోలేం. చంపబడింది ఒక వ్యాపారి. రాజకీయ పలుకుబడి ఉన్నవాడే. ఎన్నికలలో అన్నిపార్టీల నాయకులకు చందాలు ఇచ్చే అతడికోసం పదేపదే రాజకీయ నాయకులు అడుగుతూనే ఉన్నారు.వారికి బదులీయలేక ఛస్తున్నాం" నొసలు నొక్కుకుని మరీ చెప్పాడు పోలీస్ పైఅధికారి. ఆ టేబిల్కు ఎదురుగా స్టిఫ్గా నిలబడున్నారు అధికార్లు. వారిని పంపాక డిటెక్టివ్ స్వరూప్ వచ్చాడు.

"సార్ చంపబడిన సృజన్ కోసం అతడి తమ్ముడు అనిల్ ఇన్వెస్టిగేషన్ చేయమని కోరాడు. నేను ఈసరికే చాలామందిని ప్రశ్నిం చాను. సృజన్కు ఎలాంటి వ్యసనాలు లేవు. అలా అని అతడు లక్షల క్యాష్ పట్టుకుని తిరుగుతున్నాడా అంటే అదీలేదు. అర్ధరాత్రి ఇంటికి వచ్చిన అతడిని కారుదిగుతుండగా దగ్గరనుంచి కాల్చిచంపి పారిపోయాడు హంతకుడు.వాడిని ఎవరు చూడలేదు." డిటెక్టివ్ స్వరూప్ చెప్పాడు.

"స్వరూప్ నిందితుడిని ఎవరు పట్టుకున్నా మాకు కావాల్సింది నేరస్థుడు మాకు దొరికితే కోర్టులో నిలపాలి.అంతవరకు ప్రతివాడికి జవాబుదారులమై చికాకు పడుతున్నాం."

"సార్ మీరు ఒకముడి విప్పాలి."

"సంకోచించకుండా అడగండి."

"సృజన్ హత్యకేసుకు అడుగడుగున మోకాలడ్డు పడుతునే ఉన్న అజ్ఞాతవ్యక్తి ఒకడు ఉన్నాడు.లేకుంటే పోలీసులు నేరగాడిని పట్టుకోవడం పెద్దకష్టమేమికాదు.ఎవరో మీఅధికారులను మేనేజ్ చేస్తున్నారు.ఇది అసలు విషయం."

"వ్వాట్! మా ఇన్స్పెక్టర్లు డబ్బుకు అమ్ముడు పోయారంటారా?"

"మరి దేనికి అమ్ముడు పోయారో తెలియదు.కానీ, హంతకుడు మనమధ్యనే ఉన్నాడు. ఈకేసు దర్యాప్తు చేస్తున్న మీఇన్స్పెక్టర్ రవిరాజ్ అనుమానితులైనవారిని తీసుకుని వచ్చి ఠాణాలో నాలుగైదు రోజులు సెల్లోకి నెట్టేసి ప్రశ్నించాడు.ఆతరువాత వారిని వదిలే సాడు.ఆరోజుల్లో రవిరాజ్ మూడులక్షలుతో ఒకకారు స్వంతానికి కొన్నాడు. ఎలాంటి లోన్లుమీద తీసుకురాలేదు.కానీ, వేరేవారు లోను మీద ఇచ్చారు.ఆవేరేవారు ఎవరో తెలుసాసార్, హత్యగావింపబడిన సృజన్ తమ్ముడు అనిల్"

"వెరీ ఇంట్రస్టింగ్." ఇంకా చెప్పండి అన్నట్టుగానే చూసాడు

"సార్ ఇన్స్పెక్టర్ రవిరాజ్ తర్వాత జోసఫ్ను దర్యాప్తుచేయమని వేసారు.అతడు ఈహత్య పరిశోధనలో పాత అనుమానితులినే తెచ్చి ఇంటరాగేషన్ జరిపి ఆపైన వదిలేసాడు.అంతటితో ఆయన దర్యాప్తుకు టాటా కొట్టేసాడు.చివరికి అనిల్ నన్ను పరిశోధించమని కోరాడు."

"స్వరూప్ విషయానికి వచ్చేయ్.అన్నను చంపినవాడు ఈ అనిలా?మరి అతడెందుకు దర్యాప్తుచేయమని నిన్ను కోరాడు?"

"సార్ అదేచెబుతాను."

"ఎందుకు ఆఅనిల్ను అరెస్టు చేసి ఇంటరాగేషన్ జరిపితే చిన్నప్పుడు తిన్న పసరలు సయితం కక్కుతాడు" పైఅధికారి కోపంగానే స్పందించాడు.

"అంతవరకు పోవద్దు సార్.వలవేసి పట్టుకుందాం."

అధికారి ఆసక్తిగా చూసాడు స్వరూప్ వైపు.

తను ఎలా వలవేయాలనుకున్నాడో వివరించాడు.

అంతా ఓకే అయ్యింది. ఆరాత్రికే రంగసిద్ధం అయ్యింది.

పోలీస్ప్రధాన కార్యాలయంకు హడావుడిగా వెళ్లారు. ఇన్స్పెక్టర్లు రవిరాజ్,జోసఫ్లు వారు పెద్దఅధికారి ముందు నిలబడి ఉన్నారు.

"మీఇద్దరికి సృజన్ హత్యకేసు అప్పగించితే ఏదో చేసాం అన్నట్టుగానే వ్యవహరించారు. మీరు ఇంత వరకు చేసింది సాధిం చింది ఏమీలేకపోగా కేసును నీరుగార్చేసి గాలికి వదిలేసారు. చిన్నపాటి క్లూకూడా సంపాదించలేక పోయారు."

"సార్ కలకత్తాకు చెందిన గూండాతో సృజన్కు ఏదో గొడవ ఉండేదని దాంతో వాడు కాల్చిచంపి పారిపోయాడని మొన్నా మధ్య ఆకాశరామన్న ఫోన్కాల్ వచ్చింది." చెప్పాడు రవిరాజ్

"పోనీ వాడెవడో తెలుసుకుందామని నీప్రయత్నం నీవు చేసి చూపించావా?లేదు.నీకు హంతకుడు మూడులక్షలు కారు కొనిచ్చాడు.ఇక జోసఫ్ నీవు క్యాష్ తీసుకున్నావు.నీకు కేసు అప్పగించిన మరుక్షణం నీవు లక్షరూపాయలు పుచ్చుకున్నావు. ఆన్లైన్లో నీఅత్తవారి ఊళ్లో నీకున్న బ్యాంకుఎకౌంట్లో జమయ్యింది. అందుకే నిమ్మకు నీరెత్తినట్టున్నావు."పైఅధికారి ఇద్దరిని మాటలతో కడిగేసి వారిని తీక్షణంగా అడిగాడు.

వాళ్లకి ఏమి బదులీయాలో అర్ధంకాలేదు.

అంతలోనే రవిరాజ్ సెల్ మోగింది.చెవికి అదుముతుండగానే "ఆసెల్ టేబిల్మీద పెట్టు" పైఅధికారి గద్దించాడు.

రవిరాజ్ రింగ్ అవుతున్న సెల్ టేబిల్మీద పెట్టేసాడు. సెల్కాలర్లో చూస్తే అనిల్ అని ఉంది.అధికారి నవ్వేసి "ఈసెల్ రింగ్ ఆగాక నీసెల్కూడ మోగుతుంది అదీ అనిల్నుంచి వస్తుంది. ఎందుకంటే వాడిని మనపోలీసులు అరెస్టు చేయడానికి వెళ్లారు. ఆ అనిల్, పోలీసులకు బాగా ముట్టచెప్పేరకం కదా. అరెస్టు చేయడానికి వెళ్లినవారికి ఏదో ఆశచూపి ఇలా మీకు చేశాడు."

రవిరాజ్ సెల్ రింగ్ ఆగిపోయింది.ఆవెంటనే జోసఫ్ ఫోన్ రింగ్అయ్యింది.దాన్ని కిందపెట్టించాడు. వంగి కాలర్లోకి చూసాడు పైఅధికారి. అనిల్ అని ఉంది.

కొద్దిసేపటిలో అనిల్ను అరెస్టుచేసి పోలీసులు తీసుకుని వచ్చారు. ఇక నిజం ఒప్పుకోక తప్పని పరిస్థితి ఉన్నందున అనిల్ ఒప్పేసుకున్నాడు. తను అన్నతో వ్యాపారం చేస్తుండేవాడు. లెక్కలన్నీ నోటిమాటగానే ఉండేవి. ఈమధ్య తన కొడుకుకు తన వ్యాపారాలు గురించి చెప్పాలనుకున్నందున కోట్లలో లావాదేవీలు బయటపడతాయని తానే అర్ధరాత్రివేళ పిస్టోలుతో కాల్చి చంపేసాడు.కేసు నీరుగారి పోతే అన్సాల్వ్డ్ మర్డర్కేసుగా అవుతుందని ఆశించాడు. పోలీసులను మానేజ్ చేశాడు. ప్రయివేట్ డిటెక్టివ్ స్వరూప్ తను ఎలా చెబితే అలా ఉంటాడనుకుంటే పరిశోధనను నిక్కచ్చిగా చేసి తనని పట్టించినవరకు నిద్రపోలేదు. అని బాధపడ్డాడు.

★

వెతికేస్తే పోలా!

ఫ్రెండ్స్... పై బొమ్మలో కొన్ని వస్తువులు దాగున్నాయి. అవేంటంటే... కప్‌కేక్, బేస్‌బాల్, చేప, పుస్తకం, టోపీ, రెండు పక్షులు, స్పూన్, రాకెట్, రంపం, కళ్లజోడు, పెన్సిల్, సూది, క్యారెట్, ఎలుక. ఇవన్నీ ఎక్కడున్నాయో వెతికి పట్టుకుని సున్నా చుట్టండి.

ఆ ఇద్దరు ఎవరో...

హాయ్ నేస్తాలూ... ఇక్కడున్న నలుగురు అబ్బాయిలు భలేగా స్కేటింగ్ చేస్తున్నారు కదూ. ఇందులో ఇద్దరు అచ్చంగా ఒకేలా వుండి, ఒకేలా డ్రస్ చేసుకున్నారు. వాళ్లెవరు?





ఏం కనిపిస్తోందబ్బా...

హాలో పిల్లలూ... ఇక్కడ రాళ్లు ఒకదానిమీద ఒకటి పేర్చి భలేగా పెట్టారనుకుంటున్నారా. కానీ అందులో ఇంకా ఏం కనిపిస్తోందో చెప్పండి.

చుక్కలు కలిపేద్దామా...



నేనెవరో తెలుసా?

హలో పిల్లలూ... ఇవాళ మీకో చిన్న పరీక్ష. ఏంటంటే ఇక్కడ రకరకాల ప్రాణులున్నాయి చూశారుగా. వీటిలో నుండి ఒక ప్రాణి గురించి కొన్ని క్లూలు ఇస్తాము. వాటి ఆధారంగా దాని పేరేంటో చెప్పండి.

నన్ను దక్షిణ అమెరికాలో కనుగొన్నారు.

నేను గుడ్లు పెడతాను.

నేనో పెద్ద పక్షిని. ఇంకా నాకు రంగురంగుల ముక్కు కూడా వుంటుంది.

ఇప్పుడు చెప్పండి నేనెవరినో?

చెప్పగలరా...

ఫ్రెండ్స్... పై బొమ్మలో ఏదో పేరు తెలియని వింత జంతువు కనిపిస్తోంది కదూ. కానీ అది ఒక జంతువు కాదు కొన్ని జంతువుల భాగాలు కలిసి అదొక వింత జంతువులా అయింది. అయితే అవి ఏ జంతువు భాగాలో చెప్పగలరా.



నేర్చుకుందాం



నేస్తాలూ... అగ్గిపుల్లతో చేసిన Y ఆకారం మధ్యలో ఓ ఆపిల్ వుంది కదా. కేవలం రెండు అగ్గిపుల్లల్ని కదిలించి ఆపిల్ Y ఆకారం నుండి వెలుపలకి వచ్చేలా చేయాలి. చేయగలరా.

ఎలాగో చేయండి

జవాబులు

చెప్పగలరా... : పాము నాలుక, మొఖంలో సగం కుక్కపిల్లది, సగం పిల్లిది.

నేనెవరో తెలుసా?: TOUCAN

ఆ ఇద్దరు ఎవరో: 2,3

ఏ ం కనిపిస్తోందబ్బా... : అమ్మాయి

వెతికేస్తే పోలా...:



ఎలాగో చేయండి...:



అట్టమీది కథ

నయా వంచనలు

- కె.చరిత



టీవీలో వార్తలు చూస్తున్న శ్రీకాంత్ పడీ పడీ నవ్వసాగాడు. పక్క గదిలో వంట చేస్తున్న తల్లి ఆసక్తిగా

“ఏంట్రా వార్తలు చూస్తూ అంతగా నవ్వుతున్నావు? ఏం జరిగిందేంటి?!” అడిగింది.

“ఎక్కడైనా మరీ ఇంత వెర్రిమొహాలుంటారా అమ్మా...” విషయం వివరించకుండానే మళ్లీ నవ్వసాగాడు.

ఇక లాభం లేదనుకున్న తల్లి టీవీ దగ్గరకు వచ్చేసింది గరిటతో సహా.

“కేజీ బంగారం 12 లక్షలకే ఇస్తానంటూ టోపీ పెట్టిన ఘనుడు” చదువుతోంది యాంకర్.

“ఓర్నీ! పది గ్రాముల బంగారమే 16 వేలకు పైగా పలుకుతుంటే కేజీ బంగారం అంత చవగ్గా ఇస్తానని చెప్తే వీళ్లెలా నమ్మారు? పిచ్చి మొహాలు...పిచ్చిమొహాలని...” పోపు మాడిన వాసన రావడంతో లోపలికెళ్లిపోయింది శ్రీకాంత్ తల్లి.

♦♦♦

“ఏమోయ్! ఇది చూశావా? వీడెవడో పదోసారి పెళ్లి చేసుకున్నాడట. అంతమందిని ఎలా పెళ్లాడేడో...ఏమో!” కొలీగ్‌తో అన్నాడు సందేహాలరావు తన సహజ ధోరణిలో.

“అదికూడా ఒక కళ బ్రదర్. చెప్పిన మాట చెప్పకుండా చెప్పగల టాలెంట్ వుండాలి మరి. అది నీకుందా!” రెట్టించాడు కొలీగ్.

“ఆ... చేసుకుంటాడు.... చేసుకుంటాడు. ఒక్కసారి శ్రీకృష్ణజన్మస్థానానికి పంపి... లాఠీ పూజ జరిపిస్తే జన్మలో పెళ్లి అన్న మాట కూడా ఎత్తడు... పనికిమాలినవాడు” విసుక్కుంది తోటి ఉద్యోగిని.

♦♦♦

ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. ఎదుటివారు మోసపోయినప్పుడు నవ్వుకోవడమో, జాలిగా ఓ నిట్టూర్పు విడవడమో, బాధతో 'అయ్యో' అనుకోవడమో, కోపంతో తిట్ల దండకం అందుకోవడమో సర్వసాధారణం. కాకపోతే వాటిని సీరియస్‌గా తీసుకోం. అప్పడే మర్చిపోతాం. మనదాకా వచ్చినప్పుడు...ఆ ఉచ్చులో పడకుండా వుంటేనే మనం తెలివిగా వ్యవహరించినట్టు. లేకపోతే మోసపోతాం. మోసగాళ్లదే పైచేయి అవుతుంది. అలాంటి నయావంచనల కథనమే ఈ వారం మీ ముందుకొచ్చింది. అందుకొని చదివి కూసింత జాగ్రత్తగా మసలుకుంటారని ఆశిస్తూ....

ఇది మాయా ప్రపంచంరా తమ్ముడూ.. నయవంచకులు...నయావంచకులు వున్నారు చెల్లెలా...అని పాడుకోవాల్సిన సమయం. ఏమాత్రం ఏమరపాటుగా వున్నా మనకు తెలియకుండానే మనల్ని అమ్మేయగల సమర్థులున్నారీ లోకంలో. ఒకడు నిత్య పెళ్లికొడుకు వేషంలో దేశం మీద పడి అమాయకురాళ్లను మోసం చేస్తుంటాడు. పూటకో పేరు, రోజుకో వృత్తి చెప్పుకొని పెళ్లి మీద పెళ్లి చేసేసుకుంటాడు. అందినంత దోచుకుంటుంటాడు. మరొకడు ఉద్యోగాలిప్పిస్తానంటూ నిరుద్యోగులకు ఎర వేసి సొమ్ము తీసుకొని ఉడాయిస్తాడు. ఇంకొకడు చవగ్గా బంగారు బిస్కెట్లు అమ్మజూపుతాడు. చివరకు ఏ ఇత్తడి ముక్కలో చేతిలో పెట్టి లక్షలకు లక్షలు తీసుకొని జంపవుతాడు. మరొకడు బంగారు ఆభరణాలకు మెరుగు పెడతామంటూ వచ్చి వాటినే మాయచేసేస్తాడు. మరొకడు భక్తుడి రూపంలో గడికెళ్లి వీరభక్తిప్రపత్తులతో దేవుడి నగలే కొట్టుకెళ్తాడు. ఇంకొకడు ఏకంగా సినిమాల్లో ఛాన్సు ఇప్పిస్తానంటూ అమ్మాయిలు, అబ్బాయిల దగ్గర డబ్బు, నగలు.... తీసుకొని మాయమౌతాడు. ఒక సార్వాడైతే సినిమాలోలా సులభంగా డబ్బు సంపాదించాలనుకొంటాడు. అందుకోసం తుపాకులు, కత్తులు...వంటి సామాగ్రితో ప్రయోగం చేస్తాడు. ఇంతకు తెగించినవాడు ప్రాణాలు తీయడని, సొమ్ము నొక్కేయడని అనుకోలేం కదా. ఇవన్నీ ఒక ఎత్తయితే నకిలీలతో వంచించడం మరొక ఎత్తు. నకిలీ క్రెడిట్ కార్డులతో ఖాతాలో వున్న సొమ్మంతా ఖాళీ చేసేస్తాడు. దొంగ బాబాలు, దొంగ స్వాముల లీలలు తెలీనిదేముంది? పిల్లలు లేనివారికి పుట్టిస్తామంటారు. బాధలు తీరుస్తామంటారు. కష్టాలు ఆరుస్తామంటారు. అందినంత పుచ్చుకుంటారు. అనుమానం రాకముందే తుర్రుమంటారు. ఇలాంటి నకిలీ లీలలు ఎన్నో.

ఉద్యోగాలిప్పిస్తామని టోకరా

నయవంచకులకు నిరుద్యోగం మంచి ఆదాయ వనరు. చదివిన చదువుకు ఉద్యోగం దొరికితే చాలు. పెళ్లి చేసుకొని సెటిలైపోవచ్చు. కుటుంబ సమస్యలు పరిష్కరించుకోవచ్చు. అనుకునేవారెందరో వున్నారు మన చుట్టూ. ఇలాంటి వారికోసమే టార్చిలైటు వేసి మరీ వెతుకుతుంటారు మోసగాళ్లు. చక్కటి మాటలతో చిక్కటి వల అల్లేసి వేసేస్తారు. కోలా కృష్ణమోహన్ అనే పెద్దమనిషి ఇథియోపియాలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులకు వల విసిరాడు. రాష్ట్రంలో ఒక్కొక్కరి నుంచి లక్షా 50 వేల

రూపాయల వరకు వసూలు చేసుకున్నాడు. అయితే ఎంతకీ ఉద్యోగాలు రాకపోయేసరికి సదరు బాధితులు లబోదిబోమన్నారు. అయితే తెలివితెచ్చుకొని అతగాడిమీద కేసుపెట్టేశారనుకోండి!

బెంగుళూరులో ఓబుళాపురం గనుల కంపెనీలో ఉద్యోగాలిప్పిస్తామంటూ ఓ ఘనుడు డబ్బులు దండుకున్నాడు. సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలంటూ తలకు రు.15,700 చొప్పున గుంజుకున్నాడు. ఎంతకీ ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న నిరుద్యోగులు పోలీసులను ఆశ్రయించారు.

అతగాడి అసలు పేరు రామ్మోహన్. కానీ నకిలీ నామాలెన్నో. శ్రీకాంత్, మురళీకృష్ణ, దత్, మురళీధర్, అనిల్‌కుమార్, అరుణ్‌కుమార్, సందీప్, ఆనంద్... ఈ జాబితాకు అంతమే లేదు. రోజుకో పేరుతో చలామణి అయ్యాడు. ఐఎఎస్ ఆఫీసర్‌గా, డాక్టర్‌గా, న్యాయవాదిగా అవతారమెత్తుతూ ఏడాదిన్నరలో వందమందికిపైగా అమాయకులను ఉచ్చులో బిగించాడు. సత్యం...విప్రో వంటి పేరున్న సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వారిని నిలువునా ముంచాడు. ఉద్యోగం రావాలంటే మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ దాఖలు చేయాల్సి వుంటుందనేవాడు. గాంధీ, సిగ్మా, యశోద, కేర్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న డాక్టర్లు తనకు తెలుసని నోటికొచ్చిన పేర్లు చెప్పేవాడు. పరీక్షలు పూర్తి చేసుకునేలోపు బ్యాంకులో అకౌంటు తెరిచి ఆసుపత్రికి వచ్చి కలుస్తానని నమ్మించి ఆ డబ్బుతో ఉడాయించేవాడు. వైద్యపరీక్షల సమయంలో నగలు వుండకూడదని వాటినీ తీసుకునేవాడు. ఈ విషయం తెల్సుకున్న పోలీసులు ఓ శుభముహూర్తాన అతగాణ్ణి అరెస్టు చేశారు. 40 సెల్‌ఫోన్లు, ఓ ల్యాప్‌టాప్, వీసీడీ ప్లేయర్, కొంత నగదు, నగలు స్వాధీనం చేసుకున్నారు.

సినిమాలో చాన్స్ దొరికితే ఆర్థికంగా ఇబ్బందులుండవని ఆశపడిన ఓ మోడల్ నిలువునా మోసపోయింది. చెన్నైకి చెందిన గౌరీ ప్రియన్ వృత్తిరీత్యా మోడల్. సినిమాలో వేషం ఇప్పిస్తానని వరుణ్ అనే వ్యక్తి ఆమెకు ఫోన్ చేశాడు. తను తీయబోయే సినిమాలో అమితాబ్ బచ్చన్, అర్జున్‌కు చెల్లెలుగా నటించాలని అడిగాడు. వెంటనే విశాఖ కూడా రావాలన్నాడు. దాంతో గౌరీ తన ఏడేళ్ల కుమార్తెను తీసుకొని అతను చెప్పిన చోటికి వచ్చింది. పాపకు కూడా సినిమాల్లో చాన్స్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. తర్వాత మందు వేసుకొంటూ కబుర్లలో పడ్డారు. అప్పుడు అతని బ్యాగులో వున్న కొన్ని పత్రాలు బయటపడ్డాయి. అతని అసలు పేరు వరుణ్ కాదని ఇబ్రహీం అని తెల్సుకుని మోసపోయానని అర్థంచేసుకుని నిలదీసింది గౌరీ. అంతటితో ఆగక చెన్నై నుంచి విమాన ఖర్చులు, హోటల్ ఛార్జీలు...ఇతరత్రా ఖర్చులన్నీ ఇప్పించమంటూ కేసు వేసింది.

విదేశాల్లో ఉద్యోగమిప్పిస్తానంటే సహజంగానే ఆశపడతారు. ఆ బలహీనతను ఆసరా చేసుకొన్నారు సికింద్రాబాద్‌లోని గెలాక్సీ హైటెక్ సర్వీసెస్ నిర్వాహకులు. ఒక్కో వ్యక్తి నుంచి 15 నుంచి 20 వేల రూపాయల చొప్పున వసూలు చేశారు. అలా ఒకరిద్దరు కాదు ఏకంగా 200 మంది దగ్గర పోగుచేశారు. కొంతమంది దగ్గరనుంచి పాస్‌పోర్టులు కూడా తీసుకున్నారు. హైదరాబాద్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్ వాసులు వారి మోసానికి బలయ్యారు. నాలుగు నెలల అనంతరం ఓరోజు బోర్డు తిప్పేశారు. అప్పుడుగానీ జరిగిన మోసం తెలిసిరాలేదు. ఇంక పోలీసులను ఆశ్రయించినా పోయిన డబ్బులు రావుగా.

బంగారం పేర బురిడీ

కిలో బంగారం 12 లక్షలకే ఇప్పిస్తానంటే ఏం చేస్తారు? ఆ క్షణంలో బుర్ర పనిచేయడం మానేస్తుంది. వాస్తవాలను ఆలోచించే స్థితి కోల్పోతాం. రాబోయే లాభమే మెదడులో మెదులుతుంటుంది. పైగా పది గ్రాముల బంగారమే 16 వేల పైచిలుకు అమ్ముతుంటే ... కేజీ బంగారం అంత చవగ్గా వస్తుంటే వదులుకోవడమెందుకు? అనిపిస్తుంది. తమ దగ్గర లేకపోయినా అధిక వడ్డీకి తెచ్చయినా తీసుకోవడానికి సిద్ధమవుతారు. అదే జరిగింది. దుబాయ్ నుంచి తెచ్చిన బంగారు బిస్కెట్లు వున్నాయని తక్కువ ధరకే ఇస్తారని నమ్మబలికాడు బోను శ్రీనివాసరావు. శాంపిల్ బిస్కెట్ ముక్క చూశాక అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించాడు కాబట్టి సరిపోయింది. అయితే లేకపోతే టోపీ పెట్టేసేవారే.

సినిమా ప్రభావంతో పెడదారి

రాత్రికి రాత్రే సంపన్నుడైపోవాలి. ఇదీ మయాంక్ బోరా లక్ష్యం. ఆంగ్ల సినిమాలతో ప్రభావితమై అందులో చూపిన మార్గాన్నే అనుసరించాడు. ఓసారి కిడ్నాప్ అండ్ రాన్సమ్ తరహా సినిమా చూశాడు. అందులో లాగా డబ్బు సంపాదించాలని పథకం వేశాడు. అంతేనా! అందుకు సంబంధించిన పనిముట్లనూ చకచకా సమకూర్చుకున్నాడు. ఓ బొమ్మ పిస్తోలు, నాలుగు కత్తులు, ప్లాస్టిక్ తాళ్లు, గ్లౌజులు, బైనాక్యులర్, మాస్కులు వాటిలో కొన్ని మాత్రమే. బేగంపేటలోని సాయి ప్రవీణ్ కుటీర్‌లో ఫ్లాట్ అద్దెకు తీసుకొని అందులో దిగాడు. మారుతీ వ్యాన్ కొని నెంబర్ ప్లేట్ మార్చాడు. నూతన సంవత్సర వేడుకలు ముగించుకొని కారులో ఇంటికి తిరిగి వస్తున్న ఓ జంటను అటకాయించాడు. బలవంతంగా వారి కారులో చొరబడి తుపాకీ ఎక్కుపెట్టి బెదిరించాడు. కారు వేగంగా నడపమని బెదిరిస్తూ ఫ్లై ఓవర్ మీదగా బ్లూమూన్ దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ వారి చేతులు వెనక్కి కట్టివేసి సికింద్రాబాద్‌లోని మహేంద్రాహిల్స్‌కు తీసుకెళ్లాడు. రూ2 కోట్లు ఇవ్వాలంటూ బెదిరించాడు. రెండు గంటల్లో రూ.10 లక్షలు ఇస్తానని అతను సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా...ప్రాధేయపడినా విన్లేదు. ఇద్దరి మీద కత్తితో దాడిచేసి వారి వంటిమీదున్న బంగారు ఆభరణాలు...డబ్బు లాక్కుని వారిని కారులోంచి తోసేసి పారిపోయడు. భర్త చనిపోగా...భార్య తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చేరింది. అయితే తర్వాత పోలీసులు అతన్ని పట్టుకుని జైల్లోకి తోశారనుకోండి! కానీ ఒక నిండు ప్రాణం బలైపోయిందిగా.





అందరూ ఇలా బయటపడతారనుకోలేం. ఉప్పల్‌లో తక్కువ ధరకు బంగారు బిస్కెట్లు ఇస్తామంటూ దాదాపు 3 లక్షల రూపాయలు వసూలు చేసుకుని ఉడాయించారు.

భక్తుడి ముసుగులో వచ్చిన ఓ యువకుడు అమ్మవారి నగలే కొట్టేశాడు. సీతాఫల్ మండి మేడిబావిలో పోచమ్మ ముత్యాలమ్మ దేవాలయానికి ఓ యువకుడు భక్తుడిలా వచ్చాడు. అమ్మవారి ముందు అత్యంత భక్తిప్రపత్తులతో కూర్చుని ధ్యానం చేస్తున్నట్టు నటించసాగాడు. ఆలయ పూజారి ఒకరు పాపను స్కూల్లో దించి రావడానికి వెళ్లగా...మరొకరు పూజకు పూలు తేవడానికి వెళ్లారు. ఆ సమయంలో ఓ పాపను చూస్తుండమని చెప్పారు. అయితే దొంగ భక్తుడు ఆ పాపకు కొబ్బరి కాయలు తెమ్మంటూ డబ్బులిచ్చి పంపేశాడు. తర్వాత అమ్మవారి నగలు వలుచుకొని ద్విచక్రవాహనంమీద ఉడాయించాడు.

నిత్యపెళ్లికొడుకు

తుషార్ వాఘరే అలియాస్ తుషార్ బాపట్ ఎయిర్ ఇండియా ఉద్యోగి. నెలకు 70 వేల జీతం. ఇంటర్నెట్‌లో మ్యాట్రిమోనియల్ సైట్లలో ప్రొఫైల్ వుంచి పెళ్లి సంబంధాలు వెతికేవాడు. ఎవరైనా ఆసక్తి కనబరిచినప్పుడు తన మాటలతో బోల్తా కొట్టించేవాడు. విడాకుల నకిలీ పత్రాన్ని కూడా చూపించేవాడు. పెళ్లి చూపులకు సినీ ఫక్కీలో నకిలీ బంధువులను, తల్లిదండ్రులను వెంట తీసుకెళ్లేవాడు. ఇలా ఒకటి కాదు రెండు కాదు 13 పెళ్లిళ్లు చేసుకున్నాడు. ఇదే పద్ధతిలో 14వ పెళ్లి కూడా చేసుకున్నాడు. పెళ్లయిన వెంటనే ఉద్యోగరీత్యా తను ఢిల్లీ వెళ్లాల్సి వుందని అక్కడ చాలా రోజుల వరకు వుండాల్సి వస్తుందని భార్యను ముంబైలో వదిలి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అప్పటికే అతని గురించి కొంత సమాచారం తెలుసుకున్న పెళ్లికూతురి అనుమానం మరింత బలపడింది. అప్పుడు పోలీసులను ఆశ్రయించింది.

ఇమ్రాన్ అనే వ్యక్తి వలచానంటూ అంజూమ్ అనే అమ్మాయిని మోసం చేశాడు. వీరిద్దరినీ కలిపింది మాత్రం ఓ షాదీ వెబ్‌సైట్. ఎవరు కలిపితేనేమి! మోసపోయింది మాత్రం ఓ అమాయకురాలు. నాలుగు నకిలీ గాజులు చేతికి తొడిగి ఆమె ఇంట్లో వున్న 70 వేల రూపాయల నగలు తీసుకుని ఉడాయించాడు. ఇవి కాక ఆమె దగ్గర అడపాదడపా లక్షా పదిహేను వేల రూపాయలను తీసుకున్నాడు. అప్పుడు గాని అంజూమ్‌కు అతని అసలు రూపు తెలీలేదు.

నకిలీ లీలలు

ఇన్ని రకాల మోసాలను చెప్పుకున్నాక... విదేశాలకు వెళ్లే వారు వీసా పొందడానికి అవసరమైన నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారుచేస్తున్న ముఠాల సంగతి మర్చిపోతే ఎలా!! చింతల్, నాగోలు, అహ్మదాబాద్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డారు. సికింద్రాబాద్‌లోని ఎంజీ రోడ్డులో కెరియర్ ఎబ్రాడ్ ఎడ్యు సర్వీసెస్ పేరుతో ఓ సంస్థను నిర్వహించసాగారు. వీసా ప్రాసెసింగ్ ముసుగులో విదేశాలకు వెళ్లేవారు వీసా పొందడానికి అవసరమైన బ్యాంక్ స్టేట్‌మెంట్లు, ఐటి రిటర్న్స్, విద్యార్హత పత్రాలు వంటివి నకిలీవి తయారుచేసి ఇవ్వడం మొదలెట్టారు. ఇలా ఒక్కో వ్యక్తికి ప్రాసెసింగ్ చేసినందుకు రు2 లక్షల వరకు వసూలు చేసేవారు. ఈ రకంగా అనేక మందిని విదేశాలకు పంపారు కూడా. అయితే మోసం ఏదీ ఎంతో కాలం దాగదుకదా. బయటపడింది. పోలీసు మామలు వారిని పట్టుకుని అత్తగారింటికి సాగనంపారు.

విదేశాల్లో వుంటున్న భారతీయుల క్రెడిట్ కార్డుల వివరాల ఆధారంగా నకిలీవి తయారు చేసి రూ.70 లక్షల మేర స్వాహా చేసింది ఓ గ్యాంగ్. దీనికి నెల్లూరుకు చెందిన వినయ్ నాయకత్వం వహించాడు. విదేశాల్లో స్థిరపడిన వినయ్ స్నేహితులు కొందరు అక్కడున్న భారతీయుల క్రెడిట్ కార్డులకు సంబంధించిన నెంబరు, పిన్ వివరాలు అందించేవారు. వాటి ఆధారంగా డేటా లేని కార్డులు కొనుగోలు చేసి కంప్యూటర్, రైటర్‌ల సాయంతో బోగస్ కార్డులు తయారుచేసి సొమ్ము చేసుకునేవారు. యథా ప్రకారం పోలీసులకు చాలా ఆలస్యంగా తెల్సిందనుకోండి!

నిరంతర అప్రమత్తత

ఇప్పటి వరకు చెప్పుకున్న సంఘటనల్లో ఎక్కువగా రాజధానిలో జరిగినవే. పైగా ఇవి వాస్తవంగా జరిగిన వాటిలో కొన్ని మాత్రమే. ఈ జాబితా కొండవీటి చాంతాడంత వుండొచ్చు. మోసగాళ్లు, నయవంచకులు, దగాకోరులు... పేరు ఏదైనా అలాంటి వారు చాలామంది మన చుట్టూ వున్నారు. మోసపోయినవారు కూడా మన చుట్టూనే వున్నారు. కను రెప్పకు తెలియకుండా కంటిని పొడవగల నేర్పరులు వాళ్లు. తియ్యటి మాటలు చెప్పడంలో వారికి వారే సాటి. లేనిపోని ప్రేమలు, ఆప్యాయతలు కురిపించి, తడిపేయడంలో సమర్థులు (లేకపోతే పద్నాలుగు పెళ్లిళ్లు చేసుకోవడం సాధ్యమా!). బంగారు భవిష్యత్తును 90 ఎంఎం తెరమీద చూపించడంలో సిద్ధహస్తులు (అప్పుడే కదా నిరుద్యోగులకు టోపీ వేయగలిగేది). అయినప్పటికీ మన జాగ్రత్తలో మనం వుండాలి. ఉద్యోగం ఇప్పిస్తామనగానే వారడిగినంత డబ్బు ముట్టచెప్పడం, సినిమాలో చాన్స్ ఇప్పిస్తాననగానే తలూపుకుంటూ వెళ్లడం, షాదీ డాట్‌కామ్‌లో పరిచయమై ప్రేమకబుర్లు చెప్పగానే పెళ్లికి తలూపడం, చవగ్గా బంగారం ఇస్తానంటే బుట్టలో పడడం... అన్నీ ఊరికే జరిగేవి కావు. మానవ సహజ బలహీనతల వల్లే సాధ్యం. అత్యాశకు పోవడం వల్లే జరుగుతాయి. అవతలివారు మన బలహీనతలను ఆసరాగా చేసుకొని దోచుకుంటున్నారని గుర్తించాలి. అప్రమత్తంగా మెలగాలి. మనకోసం వున్న చట్టాలు, పోలీస్ స్టేషన్లను ఉపయోగించుకోగలగాలి. ఒకటికి పది రకాలుగా, చెక్ చేసుకున్నాకే ముందడుగు వేయాలి. ఆర్థిక అంశాల విషయంలోనూ అంతే. ఎక్కడైనా బిల్లు చెల్లించడానికి క్రెడిట్ కార్డులిచ్చి ఊరుకోకూడదు. దానిమీదే మన దృష్టి వుంచాలి. పూర్తి పరిచయస్తులు కానివారికి మన క్రెడిట్ కార్డు, పిన్ నెంబర్లు చెప్పకూడదు. కార్డును అందుకున్న వెంటనే దాని వెనక వైపు సంతకం చేయాలి. కార్డు వెనక వుండే సీసీవీ కోడ్‌లోని చివరి మూడు అంకెలూ భద్రమైన చోట రాసిపెట్టుకొని కార్డుమీద లేకుండా తుడిచేయాలి. కార్డు పోయిన వెంటనే సంబంధిత బ్యాంకు కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి బ్లాక్ చేయించాలి.

నిరంతర అప్రమత్తతే మనకు శ్రీరామరక్ష.

★



ఆరోగ్యం

చిన్నారులు చురుగ్గా వుండాలంటే...

పిల్లలకు మధ్య మధ్యలో కొద్దిగా అల్పాహారాన్ని ఇవ్వడం వల్ల వారి శరీరానికి కావలసిన శక్తి సమకూరి, ఉత్సాహంగా ఉంటారు. దీని వల్ల ఎక్కువగా ఆకలి ఉండదు. ఎక్కువగా తింటున్నారన్న ఆలోచనా, నీరసమూ ఉండవు. అందుకోసం వారు ఏమి తినాలో, ఏమి తినకూడదో చెప్పుకుందాం.

తృణధాన్యాలు, పప్పుదినుసులలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. వేపుడు పదార్థాల్లో, నూనె, నెయ్యి, వెన్న వంటి వాటిలో కొవ్వు, క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. రుచికరమైన బిస్కెట్లలో ఎక్కువ ఉప్పు ఉంటుంది. తీపి బిస్కెట్లలో ఇంకా ఎక్కువ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఆ రెంటినీ సరైన మోతాదులో తీసుకోవడం వల్ల చిన్న పాటి భోజనమౌతుంది. అంతేకాదు సురక్షితమైకన క్యాలరీలు, కొవ్వు పదార్థం, కార్బోహైడ్రేట్లు సమకూరతాయి.

శుద్ధి చేసిన పంచదారలో విటమిన్లు, ఖనిజాలు, పోషకాలు ఉండవు. దాని వల్ల లావు పెరగడం, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలెదురౌతాయి. అంతే కాకుండా పిల్లల్లోనూ పెద్దల్లోనూ విపరీతమైన ఉద్రేకం, చికాకు వస్తాయి. ఇంకా ఉదర సంబంధ వ్యాధులు వస్తాయి. మలబద్ధకం, చదువుపట్ల ఆసక్తి లేకపోవడం వంటివి మనం చూస్తాం.

వేపుళ్లలో కొవ్వు పదార్థం ఎక్కువగా ఉండి పోషకాలు తక్కువగా ఉంటాయి. ఆహార పదార్థాలను బాగా వేయించడం వల్ల నూనెలో అనవసరమైన రసాయన మార్పులు జరుగుతాయి. దీని వల్ల లోపలి పేగులు దెబ్బ తిని ఉదరంలో హెచ్చుతగ్గులేర్పడి పొత్తి కడుపులో నొప్పి, తలతిరుగుడు, వాంతులు, డయేరియా వంటి సమస్యలు వస్తాయి. శుద్ధి చేసిన ధాన్యాల వల్ల ఇన్సులిన్ తగ్గి రక్తపోటు (బిపి) పెరుగుతుంది. ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల కూడా బిపి పెరుగుతుంది.

పైన చెప్పుకున్న సమస్యలు ఎదురుకాకుండా ఆరోగ్యంగా, సంతృప్తిగా ఉండడానికి అనేక మార్గాలున్నాయి. అవి అందరూ అనుకుంటున్నట్టు రుచి లేకుండా, బోర్‌గా ఏమీ ఉండవు. మనం వాడుతున్న అనేక రకాల ఆహారపదార్థాలు మనకు తెలిసిన దానికంటే అతి ప్రమాదమైనవి. మనం వేపుళ్లను మన రోజువారీ ఆహారంలో భాగంగా నమ్ముతాం. మరో ఆలోచనే రాదు.

తినకూడనివి

●బాగా వేయించిన పావ్ బాజీ, ఉప్మా వంటి వాటిని తరచూ తీసుకోకూడదు.

●నూనెలో బాగా వేయించే సమోసా, బజ్జీలు, వడ, పునుగులు వంటి వాటికి దూరంగా ఉండండి.

●బాగా వేయించిన, పచ్చి ఆహార పదార్థాల మిశ్రమాన్ని తీసుకోవడం అంతమంచిది కాదు. ఉదాహరణకు భేల్‌పూరీ, ఆలు బజ్జీ, పానీ పూరీ... చాట్లు.

●పంచదారతో చేసి నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు రసగుల్లా, జిలేబీ వంటి వాటిని తినడం మానేయండి.

తినదగినవి

●ప్రతి రోజూ తీసుకునే అల్పాహారానికి ఒక ప్రణాళికను ఏర్పాటు చేసుకుని దాని ప్రకారం వాటిని మన వెంట తీసుకుపోవాలి. వేపుళ్ల కంటే ఉడకబెట్టిన వాటినే ఎక్కువగా ఎంపిక చేసుకోవాలి. జ్యూసుల్లో కంటే తాజా పళ్లలో ఎక్కువగా పీచు పదార్థం ఉంటుంది. ఎక్కడికైనా భోజనాలకు వెళ్లినప్పుడు రెండో సారికి తల అడ్డంగా ఊపడమే మంచిది.

●భేల్‌పూరీ, గోధుమ పూరీలకు బదులు అన్నం, గోధుమ రొట్టెలు, పుల్కలు ఆరోగ్యానికి మంచిది.

●పాప్‌కార్న్, చిప్స్, సమోసా, ఆలుబజ్జీ వంటివి తినడం మానేసి ఉడకబెట్టిన కూరగాయలు, కాల్చిన మొక్కజొన్న కంకులు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మంచిది.

●పప్పుగారెలు, వడల కంటే మొలకెత్తిన గింజలు తినడం ఉత్తమం.

●అరటిపండ్లు ఆల్పాహారంలోకి రావు కానీ వాటిలో మంచి పోషకాలుంటాయి. వాటికి ఇంకొంచెం రుచి రావాలంటే దానికి నిమ్మరసాన్ని అద్దితే బాగుంటుంది. చాట్ మసాలా ఇష్టమైనవారు మంచి ఫ్లేవర్‌కోసం దాన్ని అరటి పండు మీద చల్లుకుని తినొచ్చు.

●ఎండు రేగుపళ్లు, అత్తిపండ్లు, ఎండిన ద్రాక్షపండ్లు, కర్జూర పండ్లలో సహజమైన పంచదార పాళ్లు ఎక్కువగా ఉంటాయి. కొవ్వు పదార్థాలు పెద్దగా ఉండవు. ప్రతి ఆక్సీకరణలు నిండుగా ఉంటాయి. వీటి వల్ల యవ్వనంగా కనిపిస్తారు. అంతేకాదు అవి గుండె రక్తనాళాలలకు సంబంధించిన వ్యాధులను, క్యాన్సర్‌ను నిరోధిస్తాయి. పీచు పదార్థం ఎక్కువగా ఉండడం వల్ల మలబద్ధకం సమస్య ఉండదు.

●పప్పుధాన్యాల్లో పీచుపదార్థం, విటమిన్ బి అధికంగా ఉండడమే కాకుండా పీచు పదర్థాలు పుష్కలంగా ఉంటాయి. పప్పుధాన్యాలను చిక్కుళ్లతో కలిపి తింటే పూర్తి ప్రోటీన్లు మనకు లభిస్తాయి.

●ప్రతి ఆక్సీకరణలు, పీచుపదార్థం, సహజ సిద్ధమైన పంచదార, నీరు పండ్లలో సమృద్ధిగా ఉంటాయి.

●తాజా కూరగాయల్లో పీచుపదార్థం, ప్రతి ఆక్సీకరణలు, విటమిన్లు అధికంగా ఉంటాయి. గుమ్మడి, పొద్దుతిరుగుడు విత్తనాలలో మనకు కావలసిన కొవ్వుపదార్థాలు మాత్రమే ఉంటాయి. ఇంకా విటమిన్లు, ఖనిజాలు, కాల్షియం సమృద్ధిగా లభిస్తాయి.

●డైటింగుకు కావలసిన పీచుపదార్థం బియ్యం రొట్టె, చట్నీ కాంబినేషన్‌లో చక్కగా లభిస్తుంది. అందులో ఉండే విటమిన్ 'బి, ఇ' గుండె రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులు, డయాబెటిస్‌లను తగ్గిస్తాయి.

●కూరగాయలతో, ఉడికించిన బంగాళా దుంపలతో చేసిన ఉప్మాలో తక్కువ కెలోరీలు, కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండడమే కాక శక్తికి మంచి వనరు.

●ఉల్లిపాయలు, కాప్సికమ్, టమాటాలు ఎక్కువగా వేసి చేసిన ఉప్మా మంచి అల్పాహారం.

పిల్లలు ఇంట్లో, బయటా ఎన్నో ఆటలు ఆడుతుంటారు. దాంతో వారు బాగా అలసిపోతారు. దాన్ని అధిగమించి ఆరోగ్యంగా ఉండాలంటే వారికి మంచి పోషకాలు గల ఆహారాన్ని మధ్యమధ్యలో అందిస్తూ ఉండాలి. దానివల్ల వారికి శక్తి పెరగడమే కాకుండా ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటారు. అల్పాహారం దగ్గర పేచీ పెట్టేవారికి మంచి మంచి, నవ్వు తెప్పించే బొమ్మలు గల పేట్లు, కప్పుల్లో వాటిని పెడితే ఇష్టంగా తింటారు. ★



జరిగినకథ:

హావ్‌కు భర్త రెండు విషయాలు స్పష్టంగా చెప్తాడు. పాపను బాగా చూసుకోమని, శత్రువులకు వ్యతిరేకంగా పనిచేయమని కోరతాడు. అలాగేనని ఆమె అతనికి వాగ్దానం కూడా చేస్తుంది. అనాథనైన తనను భార్యగా స్వీకరించిన అతని కోరికను తీర్చి అతని రుణం తీర్చుకోవాలనుకుంటుంది హావ్. ఆ తర్వాత అతను తిరిగి వెళ్లిపోతాడు. విప్లవం కోసం పనిచేయమని హావ్‌ను డువాంగ్ అడుగుతుంది. అయితే ఆ తర్వాత భర్త దగ్గరనుంచి హావ్‌కు ఉత్తరం వస్తుంది. అది అతను పనిచేసే దళం వారు పంపారు. అది చదివి హావ్ వణికిపోతుంది. ఆ తర్వాత....

మూలం: బుయ్‌డక్ ఆయ్

తెలుగు: కొల్లి సత్యనారాయణ

(6వ భాగం)

వియత్నాం గెరిల్లా

నా భర్త పనిచేస్తున్న వర్క్‌షాప్‌పై శత్రువులు దాడి చేసినప్పుడు, వారిని తరిమికొట్టే ప్రయత్నంలో నా భర్త చనిపోయినట్లు ఆ ఉత్తరంలో రాశారు. ఆ వార్త నమ్మలేకపోయాను. ఆ ఉత్తరం మీద వర్క్‌షాప్ డైరెక్టర్ ముద్ర వున్నప్పుడు నమ్మకుండా ఎలా వుండగలను! అది వాస్తవ విషయం. నా భర్త విషయం. నా జీవన జ్యోతి ఆరిపోయింది. చుక్కాని లేని నావనయ్యాను. ఏడుస్తూనే డువాంగ్‌ను గట్టిగా పట్టుకున్నాను. డువాంగ్ మంచంమీద రెండవ వైపు కూర్చుంది. ఆడిపాడి ఆలసిపోయింది కాబోలు పాప బైట నుండి "అమ్మా అమ్మా" అని ఏడవసాగింది. డువాంగ్ బైటకు వెళ్లి పాపనెత్తుకొచ్చింది. ఆమె చేతుల నుండి గింజుకుని "అమ్మా అమ్మా" అంటూ నా దగ్గరకు వచ్చింది.

"నీ బ్రతుకు, నా బ్రతుకు ఎట్లనే" అన్నట్లుగా పాప వంక చూశాను.

డువాంగ్ నన్ను ఓదార్చుతూ, "చెల్లాయ్! అయిపోయిందేదో అయిపోయింది. ఏడిస్తే లాభం లేదు. విచారం వుంటుంది. చనిపోయినవాడు తిరిగి రాడుకదా! ధైర్యంగా వుండాలి. నీకు ఎంతో బాధ కలిగించేమాట నిజం. ధైర్యం, ఓర్పు వహించాలి. ప్రతీకారం తీర్చుకోవాలి. అందుకు నడుం కట్టాలి. అంతేగానీ అధైర్యపడకూడదు. గుండె నిబ్బరం చేసుకోవాలి. మేమంతా నీ అండ వున్నాం. మిస్టర్ బె, పాప వున్న విషయం మర్చిపోకు. పైగా గర్భిణివి. అందుకని ధైర్యంగా వుండు" అని చెప్పింది.

నాలో నేను ఎంతో ఏడ్చాను. ఒంటరితనం నన్ను కృంగదీస్తోంది. ఇంతకు ముందు నేను ఇంత ఒంటరితనం, బాధ అనుభవించలేదు. మా అమ్మ నాన్న చనిపోయినప్పుడు నాకు అంత ఊహలేదు. తర్వాత అమ్మా నాన్న లేని బిడ్డ బ్రతుకు ఎలా వుంటుందో తెలిసింది. శత్రువులు చేసిన అవమానం భరించాను. అవన్నీ కూడా ఆరోజున ఆ వార్త విన్నప్పుడు కలిగించినంత క్షోభను కలిగించలేకపోయాయి.

అథోగతి నుండి పైకి తీసుకొచ్చిన బంగారాన్ని పోగొట్టుకున్నాను. "అక్కా! మాకు ఇంక దిక్కేది" అని ఏడవసాగాను.

"ధైర్యం వహించు" అతణ్ణి గురించి నువ్వు బాధ పడడం సరైందే. అయితే, అతణ్ణి తలచుకుని నువ్వు గర్వపడాలి కూడా. ఎందుకంటే అతను వీర మరణం పొందాడు. ఆ వుత్తరంలో ఏం రాశారో చూడు. తన సహచరులతో కలిసి రోజంతా పోట్లాడాడు. ముప్పైమంది శత్రువుల్ని హతమార్చాడు. వర్క్‌షాపు శత్రువు స్వాధీనం కాకుండా కాపాడాడు. అదీ జరిగింది. చూశావా? అందువల్ల నీ భర్తను తలచుకుని బాధపడాల్సిందేమీ లేదు. వీరుని భార్యగా తలెత్తుకుని తిరుగు. పాప, పుట్టబోయే బిడ్డకు పెద్దవాళ్లైన తర్వాత వారి తండ్రి చేసిన త్యాగం గురించి చెప్పు" అని డువాంగ్ నన్ను ఎంతో ఓదార్చింది.

ఆమె మాటలు విన్న కొలదీ నాకు ఏడ్పు ఎక్కువైంది. కన్నీటి ధారకు అంతం లేకుండా పోయింది. ఆరోజు పస్తే వున్నాను. పాపకు డువాంగ్ అన్నం పెట్టింది. ఆ రాత్రి మాతో వుండిపోయింది"

■■■

ఈ విషయం చెప్పి 'హావ్' మాట్లాడడం ఆపేసింది. విచారంతో వుండిపోయింది. కళ్లు చెమర్చాయి. దూరాన వున్న చెట్లవంక చూడసాగింది. ఆరోజు మధ్యాహ్నం వాతావరణం చల్లగా వుంది. నేను మౌనంగా బెంచిమీద కూర్చున్నాను. హావ్ చాలాసేపు మౌనంగా కూర్చుని, తరువాత తన కథ చెప్పింది.

"నా భర్త చనిపోయిన తర్వాత గడిచిన రోజులు భయంకరమైనవి. మధ్యాహ్నమప్పుడు సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. చెమటతో బట్టలు తడిచిపోతున్నాయి. సాయంత్రం వేళల్లో గాలి దుమారాలు వచ్చేవి. వేలకొలదీ చేతి మరలు నెత్తిన తిరుగుతున్నట్లుండేది. సముద్రంలోని నీరు మరింత నల్లగా కనపడేది. ఆకాశంలో మబ్బులు జేగురు రంగుగా మారి పరిగెత్తిపోతూ వుండేవి. సాయంత్రం సమయంలో బీచ్‌లో వీచే ఆ గాలికి తట్టుకోలేక బలహీనులు పారిపోయేవారు. అటువంటి సమయంలో మానవులు ప్రకృతి ముందు చిన్నవారైపోతారు. సముద్రం అల్లకల్లోలమయ్యేది. తర్వాత వర్షపు జల్లులు పడేవి.

అటువంటి మధ్యాహ్నం సమయాన్ని నేను

భరించాను.

నా భర్త చనిపోయిన విషయం తెలిసి, మామయ్య పట్నం నుండి తిరిగి వచ్చాడు. దీర్ఘ నిట్టూర్పు విడుస్తూ లోనికి వెళ్లి గుట్టపై వెల్లికిలా పడుకున్నాడు. నోటంట మాటలేదు. నేనేమో పాపను ఒళ్లో పెట్టుకుని గదిలో మంచం మీద కూర్చున్నాను. నా భర్త శత్రువుతో జరిపిన వీరోచిత పోరాటం నా కళ్లముందు కదలాడసాగింది. ఆ పోరాటం జరిగిన ప్రాంతం వట్టి బురద నేలని, అన్ని రకాల చెట్లు అక్కడ పెరుగుతాయని, ఫ్రెంచి సైనికులు గాలి గుమ్మటాల్లో ఆ చెట్లమీద దిగారని ప్రజలు చెప్పుకునేవారు. ఆ విషయమే నా మనసులో మెదిలింది. మామయ్య వలల గుట్టమీదే కూర్చున్నాడు. అర్ధరాత్రప్పుడు సారాయి సీసా తీసి తాగాడు. సారాయి తాగడం ఆయన కళ్లకు దెబ్బని తెలిసికూడా తాగొద్దని చెప్పడానికి నాకు ధైర్యం చాలలేదు.

"పాపేమో చిన్నది. నేనేమో వెళ్లిపోతున్నాను. నువ్వు పాపను చక్కగా పెంచి పెద్దదాన్ని చేస్తావన్న నమ్మకం నాకు వుంది. పాపే మన ఆశ, ప్రాణం. నేను స్వయంగా పెంచే అవకాశం లేదు. బాధ్యతంతా నీదే" అన్న నా భర్త మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. ఆ మాటలు నన్నెంతో కదిలించి వేశాయి. అప్రయత్నంగానే 'సరే' అన్నాను. అవే అతని చివరి మాటలని తర్వాత అర్థమైంది. నాకు పిచ్చి నమ్మకాలేమీ లేవుకానీ ఒకరు చనిపోబోయే ముందు చెప్పే మాటలకు ప్రత్యేక అర్థం వుంటుందని నేను అనుకుంటాను.

ఆందోళనను, విచారాన్ని అణచిపెట్టుకున్నాను. "అనాథగా బతుకుతూ పిల్లల్ని పెంచాలి. నేను బతికుంటేనే, ఎన్ని కష్టాలు వచ్చినా భరించి పిల్లల్ని పెంచగలుగుతాను. నా భర్త ఏ ఆశయం కోసం ప్రాణత్యాగం చేశాడో ఆ ఆశయ సాధన కోసం నేనూ కృషి చేయాలి. అదే నా ధ్యేయం" అన్న నిర్ణయానికి వచ్చాను. అలా ఆలోచిస్తూ పాప తలను నా చెంపలకు హత్తుకున్నాను.

నేనేమో గర్భవతిని. పాప చిన్నది. నన్ను ఓదార్చడానికి, ఉత్సాహపర్చడానికి ఆయనతో గడిపిన ఆ సంతోష దినాల ఫలితమే ఇది. ఆయన వెళ్లిపోయిన కొంత కాలానికి నాలో మార్పును గమనించాను. లోగడ అనుభవం వుండడం వల్ల ఈ విషయం తెలియజేస్తూ ఆయనకు ఉత్తరం రాశాను. ఆయన చనిపోయిన రోజుకు నెల రోజుల ముందు ఆ వుత్తరం ఆయనకు చేరింది. ప్రతీ చిన్న విషయాన్ని వివరంగా తెలియజేస్తూ వుత్తరం రాశాడు. నా ఆరోగ్యం గురించి జాగ్రత్తగా వుండమని పుట్టబోయే బిడ్డను మంచిగా పెంచమని ఆ వుత్తరంలో సలహాయిచ్చాడు. ఆ వుత్తరం ఇంకా నా దగ్గరే వుంది. నాకు ప్రమాదం జరగలేదు కానీ, ఆయనకు జరిగింది. నాకిక ఆయన లేడు".

ఈ విధంగా నేను ఆలోచిస్తూ వుండగా పాప నిద్రపోయింది. నిద్ర మేల్కొనగానే నా కోసం చేతులు చాచింది. పాప పక్కనే పడుకున్నాను. నిద్ర రావడంలేదు. బయట ధారాపాతంగా వర్షం కురుస్తోంది. సముద్రం ఘోషపెడుతోంది. భర్త మరణంతో ప్రారంభమైన నా ఆలోచన రాబోయే కష్ట దినాల్ని గురించి ఆలోచించసాగింది. మామయ్య ఆరోగ్యం సంగతి చూడాలి. పిల్లల్ని పెంచాలి. ప్రసూతి సమయంలో ఇతరులకు సహాయం చేయాలి. ఉద్యమంలో నా పాత్ర సక్రమంగా నిర్వహించాలి. బాధ్యతల్ని చివరికంటా నిర్వహించాలి. వీటికి తోడు డువాంగ్ కొత్తగా అప్పగించిన బాధ్యత వుండనే వుంది. అందుకు అంగీకరించాను కూడా. ఈ బాధ్యత నుండి నన్ను తప్పించమని కోరదామన్న ఆలోచన కూడా వుంది. కానీ, నా భర్త చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. "హావ్' నువ్వు చేసే పని ప్రజలకు, ఉద్యమానికి సహాయపడుతుంది. మంత్రసాని పనితోపాటు శత్రు వర్గాలలో ప్రచారం చేయమని అడిగితే అంగీకరించు" అని ఆయన చెప్పిన మాటలు గుర్తుకు రాగానే ఒళ్లు జలదరించింది. ఆ బాధ్యతను విడిచిపెడతానా!? నేను చేసిన వాగ్దానం దిగమింగడమే కాకుండా, మరింక లేకుండా పోయిన నా ప్రాణ ప్రియుణ్ణి మోసం చేయడమౌతుంది. నాకు జరిగిన అవమానం ఒక వంక, భర్తపోయిన విచారం మరొక వంక నా హృదయాన్ని దహించి వేస్తున్నాయి. భర్త మరణవార్త వినకముందూ, తర్వాతా కూడా ఆ బాధ్యతలు నెరవేర్చాలని గట్టిగా నిశ్చయించుకున్నాను. డువాంగ్ అప్పగించిన బాధ్యత ప్రాముఖ్యతను గుర్తించాను. ఆ బాధ్యత నెరవేర్చడానికి నాకు అనుకూల పరిస్థితి కూడా వుంది. అయితే వున్న అడ్డంకల్లా పాపే. ఎవరికి అప్పగించాలి? ఈ విషయం ఆలోచిస్తూ రెండు రోజులు జాగారం చేశాను.

మూడోరోజు రాత్రి ఎంత సేపు నిద్రపోయానో నాకు తెలియదు. గుర్రపు డెక్కల చప్పుడు విని ఉలిక్కిపడి లేచాను. ఎవరో బైట మామయ్యతో మాట్లాడుతున్నట్లు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. తర్వాత స్పష్టంగా వినిపించాయి. "ఆమెను ఒక్కసారి చూడనియ్యి. నీకు దండం పెడతాను..." అంటున్నాడు కొత్త వ్యక్తి.

"ఎందుకు?" మామయ్య ప్రశ్న.

అతను ఎగరొప్పుతున్నాడు. రొప్పుతూనే "నా భార్య ప్రసవవేదన పడుతోంది. నిజం చెబుతున్నాను. 'హీప్‌లో' ప్రాంతం నుండి వచ్చాను. ఈ అర్ధరాత్రివేళ మిమ్మల్ని కష్టపెట్టడం నాకిష్టం లేదు. కానీ, నా భార్య బాధపడుతోంది. చూడలేక వచ్చాను".

"మరొక మంత్రసానిని చూసుకోండి. మార్కెట్ ప్రాంతంలో చాలా మంది వున్నారు. కోడలు నిద్రపోతోంది. పైగా...." అంటున్నాడు మామయ్య.

"సహాయం చేయమని ప్రార్థిస్తున్నాను. దయ వుంచి ఆమెతో చెప్పండి. ఈ వాతావరణంలో ప్రయాణం చేయడం కష్టమని నాకు తెలుసు. కానీ ఆమెను తీసుకెళ్లడానికి గుర్రబ్బండి వుంది. స్వయంగా నేనే తోలతాను. నేను బండితోలేవాడిని కూడా. భయపడకండి. జాగ్రత్తగా తీసుకెళ్తాను. దయ వుంచండి. సహాయం చేయండి. ఆమె ప్రాణం కాపాడండి" అంటూ అతను ప్రార్థిస్తున్నాడు.

"మిత్రమా! మామూలు రోజుల్లో అయితే ఆమెను వెంటనే పిలిచేవాణ్ణి... నువ్వు కొత్తవాడివి. ఏం జరిగిందో నీకు తెలీదు. ఆమె భర్త చనిపోయాడు. ఆమె విచారంలో వుంది. ఎక్కడకూ రాదు"

దీర్ఘంగా నిట్టూరుస్తూ, "అలాగా" అని నిరాశతో వలల కుప్పమీద కూలబడ్డట్టు తోచింది. బైట బండిని గుర్రం గుంజుతోంది. గాలి తీవ్రంగా వుంది. మధ్య మధ్యలో గుర్రం సకిలిస్తోంది. అతను మామయ్యను తిరిగి బతిమాలుతున్నట్లు వినపడింది. అతని గొంతులో ఆందోళన, భయం ఎక్కువౌతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

"ఇంటికి పోక చేసేదేముంది? నా భార్య బతుకుతుందన్న ఆశలేదు. బిడ్డ సంగతి సరేసరి. క్రితంరోజు గుర్రాన్ని బీట్లోకి తోలుకెళ్లింది. శత్రు అధికారి వచ్చి గుర్రాన్ని తోలుకెళ్లాడు. గుర్రం దక్కదన్న భయంతో వెంట పరుగెత్తింది. గుర్రం గంతులేస్తే పైన ఎక్కిన అధికారి కిందపడ్డాడు. లేచివచ్చి నా భార్యను కొట్టాడు. అతని మాటలు తడబడ్డాయి. "పొట్టమీద తన్నాడు. ఆమె ఏడోనెల గర్భిణీ. ఇప్పుడు ప్రసవవేదన పడుతోంది. మంత్రసాని దొరకలేదు. నా గతేంకాను? నా గతేంకాను?" అంటూ గోల పెట్టాడు.

ఒక్క ఊపుతో లేచి నిలబడ్డాడు. రొమ్ములపై పెద్ద బరువు పెట్టినట్లుగా వుంది. కొద్దిసేపు మాట్లాడకుండా వుండి, అతను తిరిగి "మార్కెట్ వద్ద మరొక మంత్రసానిని చూసుకోమన్నావ్. అర్ధరాత్రి చీకట్లో వాళ్ల కాల్పులకు గురికామంటారా? ఇక్కడకు రావడానికి గ్రామాధికారి పర్మిషన్ తెచ్చుకోవాల్సి వచ్చింది. బండికి దీపం కట్టకపోతే వాళ్లు తుపాకులతో కాల్చేవారు. ఎట్లాగో ఇక్కడకు వచ్చాను. ఇంక లాభంలేదు. ఇంటికి పోతాను" అన్నాడు నీరసంగా.

ఆమాట అంటూ విసురుగా తలుపు తెరిచి బైటికెళ్లి వెనుతిరిగి "ఆమె భర్త చనిపోయాడు. తిరిగిరాడు, బతికున్నవాళ్లు సహాయం లేక చనిపోవటానికి అది కారణం కారాదు. మళ్లీ ఎన్నడూ మీ ఇంటి ముఖం చూడను" అంటూ దబాలున తలుపేశాడు. నేను తలుపు తీసుకుని బయటికి పరుగెత్తాను.

(ఇంతకీ కాన్పు చేయడానికి హావ్ వెళ్లగలిగిందా లేదా?)

(ఇంకా వుంది)

విజ్ఞాన వీచిక

బిపి పెంచుతున్న బిటీ



ప్రస్తుతం దేశమంతటా వంకాయ గురించి చర్చలే చర్చలు. బిటి వంకాయ వద్దని రైతులు, ఇతర ప్రజా సంఘాలవారు ఆందోళన పడుతున్నారు. ఇంతకీ బిటి అంటే ఏమిటి? దీనికీ వంకాయకీ ఏమి సంబంధం?

- కాకర్లమూడి విజయ్

బిటి అంటే చాలా మంది బయో టెక్నాలజీ అనుకుంటారు. అందుకు కారణం ఈ టెక్నాలజీ ద్వారా జన్యు మార్పిడి చేసి పంటలలో కొన్ని కావలసిన లక్షణాలను పెడుతున్నారు. కానీ, నిజానికి బిటి అంటే బాసిల్లస్ తురింజినిసిస్ అనే ఒక రకం బాక్టీరియా! ఈ బాక్టీరియా జన్యువులను వంకాయలో పెడుతున్నారు. ఇంతకీ ఈ జన్యువులు ఏమి చేస్తాయని అనుమానం?

బాసిల్లస్ తురింజినిసిస్ నేలలో జీవించే సూక్ష్మజీవి. దీనిని 1901లో జపాన్‌లో కనుగొన్నారు. ఆ కాలంలో విపరీతంగా చనిపోతున్న పట్టు పురుగులపై చేసిన పరిశోధనలో దీనికి కారణం ఈ బాక్టీరియా అని తెలిసింది. అలాగే జర్మనీలో కూడా మరో 10 సంవత్సరాల తరువాత మరో రకం కీటకం చనిపోవడానికి కూడా ఈ బిటి సూక్ష్మజీవే కారణమని నిర్ధారణైంది. క్రమంగా బిటికి ఉన్న కీటక సంహారణ లక్షణంపై పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ఫలితంగా, మరో తొమ్మిదేళ్లకు బిటిని క్రిమిసంహారకంగా వాడడం మొదలైంది.

80వ దశకంలో కృత్రిమ రసాయన క్రిమి సంహారకాలకు కీటకాలు నిరోధకత పెంచుకోవడంతో ఆ రసాయనాలను మరింత ఎక్కువ మోతాదుల్లో వాడాల్సి వచ్చింది. అందువల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని గమనించి, బిటిని వాడడం అధికం చేశారు. బిటి మందు సేంద్రీయ మూలాలు కలిగి ఉండడం, కేవలం కీటకాలను మాత్రమే నిర్మూలించి, పర్యావరణానికి హాని కలిగించకపోవడంతో సస్యరక్షణ మందుగా బిటి ప్రజాదరణ పొందింది.

మాలిక్యులార్ బయాలజీ రంగం అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో కొత్త ఆలోచనలు మొలకెత్తాయి. కీటకాలను సంహరించడానికి బిటి ప్రత్యేకమైన స్ఫటికాలు గల ప్రొటీన్లను ఉత్పత్తి చేస్తుంది. ఆ స్ఫటికాల వల్లే కీటకాల జీవ చర్యలు దెబ్బ తిని మరణిస్తాయి. అటువంటి స్ఫటిక ప్రొటీన్లను గనుక మనమే నేరుగా మొక్కల్లోనే సృష్టింప చేయగలిగితే అసలు పైరుపై మందు చల్లకుండా కీటకాల బారినుండి పైరును రక్షించవచ్చు అనే ఆలోచన వచ్చింది. ఇది ఉత్పత్తి చేసే రసాయనం కేవలం సీతాకోక చిలుకకు సంబంధించిన లార్వాకు విషంగా పనిచేసి చంపుతుంది.

ఆ టాక్సిన్ స్ఫటికాలకు కారణమైన జన్యువును మొక్కలలో ప్రవేశపెట్టే ప్రక్రియ విజయవంతమైంది. అటువంటి మొట్టమొదటి బిటి పంట మొక్కజొన్న. 1995లో రూపొంది రిజిస్టరైంది. ఈనాడు పత్తి, సోయాబీన్, బంగాళా దుంప, వంకాయ వంటి ఎన్నో పంటలను బిటి జన్యువుతో సృష్టించారు.

ఈ బిటి పంటల వల్ల మొదట కొన్ని సంవత్సరాలలో కృత్రిమ రసాయనాల వాడకం ఓ మోస్తరుగా తగ్గిందనే చెప్పవచ్చు. స్థూలంగా బిటి పంటల వల్ల రైతులకు కొంతమేర శ్రమ తగ్గుతుంది. అయితే బిటి టాక్సిన్ల వల్ల ఇతరత్రా ఎటువంటి ప్రభావాలు ఉంటాయో అని ఒక ఆందోళన మొదలైంది. ఎన్నో సంవత్సరాలుగా బిటి టాక్సిన్లను పంటలపై చల్లడం సాధారణంగా జరుగుతున్నదే. ఆ కారణంగా పర్యావరణం మీదగానీ, మన ఆరోగ్యం మీదగానీ ఎలాంటి దుష్ప్రభావమూ కనిపించలేదు అని బిటి సమర్ధకులు చెపుతున్నారు. కానీ బిటి మందును అవసరం వున్నప్పుడు మాత్రమే స్ప్రే చేస్తారు. దీనికి విరుద్ధంగా బిటి పంటలో బిటి విషం అవసరం వున్నా లేకపోయినా నిరంతరం ఉత్పత్తి అవుతుంది. తద్వారా పర్యావరణంలో విష ప్రభావం పెరుగుతుంది. వీని ద్వారా రాగల దుష్ప్రభావాలను బిటి సమర్ధకులు గమనంలో ఉంచుకోవడంలేదు.

వాస్తవానికి బిటి టాక్సిన్ల సామర్థ్యం కొన్ని నిర్దిష్ట కీటకాలపైనే ఉంటుంది. కీటకాలు ఈ టాక్సిన్లను ఆహారంగా తింటే తప్ప వాటి ప్రభావం కనిపించదు. బిటి టాక్సిన్లు కీటకాల ప్రేవులను ఛేదించి హాని కలిగిస్తాయి. అంటే ఈ బిటి వల్ల ఇతర జీవులకు పెద్దగా పైకి కనపడే నష్టం జరగదని అనుకోవచ్చు. కానీ ప్రయోగాల ఫలితాలు మరోలా అవుపడుతున్నాయి. బిటి టాక్సిన్లు ఉన్న మొక్క భాగాలను గానీ, టాక్సిన్లను తిన్న కీటకాలను గానీ తిన్న జీవులలో కొన్ని దుష్ప్రభావాలు కనిపించాయి. అయితే సరైన శాస్త్రీయ సమాచారం లేమి కారణంగా వాస్తవ పరిస్థితుల్లో కలిగే ప్రభావాలు ఎలా ఉంటాయో ఇప్పుడే పూర్తిగా తెలియలేదు.

బిటి సురక్షితమైంది కాదని కొన్ని ప్రయోగాలు నిర్ధారించాయి కూడా. మూడేళ్ల క్రితం యూరప్‌లో జరిపిన ఒక అధ్యయనంలో బిటి పంటల వల్ల కాలేయం దెబ్బతినే ప్రమాదముందని తెలిసింది. కానీ ఈ పరీక్షలు ఎలుకలపై జరిగాయి. అదీ గరిష్టంగా 90 రోజుల వరకే జరిగాయి. కానీ ఆహారాన్ని జీవితకాలం తింటాంగా. అందువల్ల దీర్ఘకాల ప్రయోగాలు జరగాలి.

గత పదిహేనేళ్లుగా జన్యుమార్పిడి పంట ఉత్పత్తులను తింటున్నా గమనించదగ్గ చెడు ప్రభావాలు కనిపించలేదని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కానీ ఈ పంటలు వేరు. కోయగానే తినే కూరగాయల విషయం వేరు. కూరగాయతో పాటు విషాన్ని కూడా తినాల్సి వస్తుంది. అయినా ఇటువంటి పంటలపై సరైన అధ్యయనం జరగలేదని, కాబట్టి రాబోయే ప్రమాదాలు అన్నీ తెలియకపోవచ్చని కొంతమంది అంటున్నారు. కేవలం బిటి పంటలే కాక జన్యు పరివర్తిత పంటల వల్ల దీర్ఘకాలంలో వచ్చే సమస్యలు సంపూర్తిగా అవగాహన కాలేదు. తొలి రోజుల్లో జన్యుపరివర్తిత పంటలకు మానవులు నేరుగా భుజించని వాటిని ఎన్నుకున్నారు. పత్తి అటువంటిదే. కానీ రాను రాను సోయా చిక్కుళ్ల,

మొక్కజొన్న, దుంపలు ఈ శ్రేణిలో చేరాయి.

తాజాగా, మనదేశంలో వంకాయను జన్యుపరివర్తిత రకంగా రూపొందించారు. ఇది సురక్షితమని నిర్ధారించాలి. దీనికోసం మరిన్ని పరిశోధనలు చేయాల్సి వుంది. గత ఏడాది (2009) అక్టోబరులో బిటి వంకాయను ప్రయోగాత్మకంగా ఉత్పత్తి చేయడానికి జీవసాంకేతిక పరిజ్ఞాన అనుమతి మండలి (జిఇఎసి) అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో మనదేశంలోని ఎన్నో రాష్ట్రాలలో బిటి వంకాయకు వ్యతిరేకత ఎదురైంది. ఇంకా ఎదురవుతోంది. అందుకు కారణం మనకు ఇంకా ఇతమిద్ధంగా తెలియని ప్రమాదాలే కాక ప్రస్తుత పరిస్థితులలో మన వ్యవసాయ రంగంలో ఇది తీసుకురాగల దుష్పరిణామాలు కూడా మరొక కారణం. దాంతోపాటు, బిటి వంగడాలు అన్ని రకాల కీటకాలను నిర్మూలించలేదనేది కూడా స్పష్టం. అంటే రైతులు కీటక నాశకాలపై పెట్టే ఖర్చు మొత్తంమీద అంతగా తగ్గే అవకాశం లేదు. కాబట్టి రైతులకు బిటి వల్ల ఒనగూడే లాభమేమీ వుండదు.

బిటి వల్ల పంట దిగుబడి, రాబడి నేరుగా పెరగవు. పైగా ఈ పంటలు కేవలం కొన్ని రకాల పురుగులనే ఎదుర్కోగలవు. అందువల్ల బిటి పంటల వల్ల రసాయన మందుల వాడకం అవసరం లేదని చెప్పడం సరికాదు. పైపెచ్చు ఈ పంటలకు లొంగే కీటకాలు కూడా కొన్ని తరాలలోనే నిరోధకత్వం పెంచుకుంటాయి (సహజంగానే, పరిణామ ప్రక్రియలో నిరోధకత్వం పెరుగుతుంది). అప్పుడు బిటి వంగడాలు చేసే మేలేమీ ఉండదు. అంటే 5-6 సంవత్సరాలలో బిటి మొక్కలలోని జన్యువులు నిరర్థకం అవుతాయి. ఈ నిరోధకత్వాన్ని ఆలస్యం చేసేందుకే ఎరపంట(రెఫ్యూజీ పంట)ను 30శాతం దాకా వేయాలి. ఇది బిటి సాంకేతిక అస్థిరత్వాన్ని నిరూపిస్తుంది. ఇదే కాక నాన్ బిటి ఎరపంట ద్వారా దీనివల్ల రాగల నష్టాల్ని బిటి ద్వారా వచ్చే లాభాల నుంచి తీసివేసి బిటి నికర లాభాన్ని తేల్చాలి. కానీ కంపెనీ మోసపూరితంగా, 'బిటి' ద్వారా రాగల తాత్కాలిక లాభాల్నే చూపుతుంది. నికర లాభాల్ని చెప్పడంలేదు.

చైనాలోని మొక్కల సంరక్షణ సంస్థ పది పన్నెండు తరాల తరువాత బోల్ వార్మ్‌పై బిటి ప్రభావం శూన్యం అని నిరూపించింది. మరో కోణం: కొన్ని రకాల కీటకాలు బిటి మొక్కల దరిచేరకపోయినా ఇతర కీటక దాడి పెరిగిపోతుంది.

బిటి మొక్కలలో కాకుండా అసలు జన్యుపరివర్తిత మొక్కల వల్ల మరో నష్టం ఉంది. అది జీవవైవిధ్యానికి ప్రమాదమైనది. బిటి మొక్కలు సహజ మొక్కల దగ్గరే పెరగడం వల్ల, పుప్పొడి ద్వారా బిటి జన్యువులు సర్వత్రా వ్యాపించి వంగ జాతికి చెందిన ఇతర సహజ జాతులను కలుషితం చేస్తాయి. ఈ దిశలో రాబోయే ప్రమాదాలు ఊహించనంతగా ఉంటాయని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

జన్యు పరివర్తిత పంటలు, తద్వారా వచ్చే ఆహార పదార్థాలు, పోషకాల లోపాన్ని, ఆహారలేమి సమస్యని పరిష్కరించగల శక్తిగలవిగా చెబుతున్నారు. కానీ, ఇవన్నీ నిరూపణ కావలసిన అంశాలే. ఈ బిటి పరిజ్ఞానం కొత్తది కావడం వల్ల ఇప్పటివరకు జరిపిన అధ్యయనాలు మరింత విస్తృతంగా జరగాలని నిపుణులు భావిస్తున్నారు. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ మరెన్నో అద్భుతాలను చూపనుందని కొందరు అంటే, అత్యుత్సాహంతో అనర్థాలను కొని తెచ్చుకోవద్దని విజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

★



చూద్దామా

అజంతా ఎల్లోరా అందాలు ఆస్వాదిద్దామా


ఘృష్ణేశ్వరాలయం

కనులు తిప్పకోనీయని అందాలు అజంతా సొంతం. అజంతా, ఎల్లోరా గుహలు భారతీయ శిల్పకళలకు తార్కాణం. హిందూ, బౌద్ధ, జైన మతాలకు సంబంధించిన శిల్పకళారీతులు ఒకే చోట కనువిందు చేస్తాయి. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన ఘృష్ణేశ్వరుడు ఇక్కడ కొలువుతీరి ఉన్నాడు. మరి ఈవారం అజంతా ఎల్లోరా గుహల అందాలను, అక్కడి శిల్పసౌందర్యాన్ని ఓసారి పరికిద్దాం.

ఔరంగాబాద్‌కు 107 కిలోమీటర్ల దూరంలో అజంతా గుహలు ఉంటాయి. 56 మీటర్ల ఎత్తులోని పర్వతాలమీద ఈ గుహలు పడమర నుంచి తూర్పుకు వ్యాపించి ఉంటాయి. 1819లో జాన్‌స్మిత్ అనే బ్రిటీషు అధికారి వీటిని గుర్తించాడు. ఇక్కడ మొత్తం 29 గుహలుంటాయి. ఆయన ఈ గుహలను ఎక్కడి నుంచైతే చూశాడో ఆ ప్రదేశాన్ని వ్యూ పాయింటుగా చెప్తారు. అక్కడి నుంచి ఈ గుహలకు గల దారి గుర్రపు నాడాలా సన్నగా కనిపిస్తుంది. చుట్టుపక్కల పరిసరాలు, అక్కడి జలపాతాలు ఎంతో అందంగా ఉంటాయి.

పెయింటింగులతో నిండి ఉండే ఈ గుహలు సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తాయి. గుహల పైకప్పు, పక్కభాగాలలో బుద్ధుని జీవిత విషయాలను చిత్రీకరించారు. సరిగా పరిశీలిస్తే వాటిలోని మూలార్థం మనకు తెలుస్తుంది.

ఒకటో నెంబరు గల గుహలో పెద్ద పెద్ద స్తంభాలతో కూడిన పెద్ద చావడి ఉంటుంది. దాని గోడలపై బుద్ధుని జీవిత విషయాలను వర్ణించే చిత్రాలు ఉంటాయి. ఈ చావడికి ఎడమవైపున ఉన్న హాలులో వేటగాడు పన్నిన వలనుంచి పావురాన్ని రక్షిస్తున్న శిబిచక్రవర్తి చిత్రం, జాతక కథలు ఉన్నాయి. అక్కడే మరోవైపు సభామంటపం, బుద్ధుని తల్లి మాయాదేవి స్నానం చేస్తున్న దృశ్యం, పైకప్పున పక్షులు, పష్పాలు వంటి అనేక చిత్రాలు చాలా బాగుంటాయి. ఇక్కడ సందర్శకులను మరింతగా ఆకట్టుకునే మరో చిత్రమేంటంటే ఒకే తలతో నాలుగు దుప్పులను చిత్రించడం. ఏ దుప్పిని చూసినా ఆ తల దానిదే అన్నట్టుగా ఉంటుంది. రెండో గుహలో బుద్ధుని పుట్టుకను చిత్రించారు. దాని పైకప్పు మీద హంసలు బారులు తీరిన దృశ్యం ఎంతో బాగుంటుంది.

ఇంకా అప్పట్లో వారు వాడిన మఫ్లర్లు, పర్సులు, చెప్పులు వంటి వాటిని కూడా చిత్రించారు. 16వ నెంబరు గుహలో బుద్ధుని జీవితంలో ఎదురైన అనేక సంఘటనలను మనం చూడొచ్చు. ఇంకా బుద్ధుని సోదరుడైన నందుడు సన్యాసిగా మారిపోయిన విషయం తెలిసి అతని భార్య మూర్ఛపోయిన దృశ్యం, స్పృహ తప్పిపోయిన తల్లికి సపర్యలు చేస్తున్న పరిచారికల దృశ్యాలను చిత్రాలుగా మలిచారు. ఆ పరిచారిక వేసుకున్న దుస్తులు ఇప్పటి మన నర్సులు వేసుకున్న దుస్తులలానే ఉంటాయి.

క్రీస్తు పూర్వం 2-7 శతాబ్దాల మధ్య కాలంలో వీటిని చిత్రీకరించారు. అప్పుడు వేసిన చిత్రాలకు గల రంగులు ఇప్పటికీ ఉండడం చిత్రంగానే ఉంటుంది. ఈ చిత్రాలను వేయడానికి వారు ప్రత్యేక పద్ధతులను వాడేవారు. దాని కోసం ముందుగా రాళ్లను చదును చేసేవారు. తరువాత మట్టి, ఆవుపేడ, పీచు, జంతువుల జుట్టు కలిపిన ముద్దను ఆ రాళ్ల మీద 6,7 సెంటీమీటర్ల ఎత్తు వరకు పెట్టేవారు. అది ఆరిపోక ముందే తాము వేయాలనుకున్న ఆకారాన్ని దానితో చేసేవారు. వాటికి నలుపు కోసం దీపపు మసి, తెలుపు కోసం సున్నపు రాయి... ఇలా సహజమైన రంగులను అద్దేవారు.

ఎల్లోరా గుహలు

ఎల్లోరా గుహలను రాష్ట్రకూటులు, చాళుక్యుల కాలంలో చెక్కారట. ఔరంగాబాద్‌కు వాయవ్యంగా 61 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. కొండలను తొలిచి ఇంత చక్కటి అందాలను మన కోసమే తీర్చిదిద్దినట్టుంటాయి. వీటి నిర్మాణంలో ఒక విశిష్టత ఉంది. మొదట పై అంతస్తు, అందులోని శిల్పాలను చెక్కి ఆ తరువాత కింది అంతస్తు, అక్కడి శిల్పాలు చెక్కారట. ఇక్కడ మొత్తం 34 గుహలుంటాయి. సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే ఈ గుహల అందాలు దృష్టిని మరల్చనీయవు. మొదట బౌద్ధులకు సంబంధించిన 12 గుహలు ఉంటాయి. వీటిని 5-8 శతాబ్దాల మధ్య


ఎల్లోరా గుహల్లోని జలపాతం...

కాలంలో చెక్కారు. 6-9 శతాబ్ద కాలంలో చెక్కినవి హిందువుల గుహలు. అవి మొత్తం 17 గుహలు. చివర్లో జైనుల గుహలుంటాయి. ఇవి 8-10 శతాబ్దాల మధ్య కాలంలో చెక్కినవి. వీటిని హెరిటేజ్ సైట్లుగా కూడా గుర్తించింది. అయితే వీటిలో కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి.

పదో నెంబరు గుహ చైత్యం. అది తప్ప మిగిలినవన్నీ బౌద్ధ విహారాలు. వారు ఈ గుహలను బోధనశాలలుగా, ధాన్యాగారంగా, ప్రార్థనామందిరాలుగా, భోజనశాలగా, పడకగదులుగా ఉపయోగించుకునేవారు. బోధిసత్వుడి భారీ విగ్రహాలు 2 ద్వారపాలకులుగా రెండో గుహ వద్ద ఉంటాయి. ఐదో గుహ వీటిలో పెద్దది. దీని పొడవు 36 మీటర్లు. ఈ గుహలో ఇరువైపులా రాయిని బెంచీలాగా చెక్కారు. బౌద్ధులకు ఇక్కడ శిక్షణా తరగతులను నిర్వహించేవారట. ఆరో గుహలోని బోధిసత్వుని భార్య తార శిల్పంలో జీవం ఉట్టిపడుతుంది. ఇంకా అక్కడ బౌద్ధుల జ్ఞానదేవత మహామయూరీ శిల్పాన్ని కూడా చూడొచ్చు. 12వ గుహలో 3 అంతస్తులుంటాయి. పై అంతస్తులో 5 బోధిసత్వుని శిల్పాలు, వాటికిరువైపులా ఏడు బుద్ధుని శిల్పాలు చెక్కి ఉన్నాయి. 13 నుంచి 29 వరకూ ఉన్న గుహలలో అన్నీ హిందూ మతానికి సంబంధించిన శిల్పాలు ఉంటాయి. వీటిలో ఎక్కువ శివునివే చూస్తాం. పరమేశ్వరుడు పాములను మెడలో వేసుకున్నట్లు, శివుడు ప్రత్యక్షమైనట్లు, మార్కండేయుడు శివలింగాన్ని పట్టుకుని ఉండగా యముడు పాశం వేస్తున్నట్లున్న శిల్పాలను చూస్తుంటే ఆ దృశ్యాలు కళ్లముందు కదలాడినట్లుంటాయి.

14వ గుహకిరువైపులా గంగా యమునలు ఆహ్వానిస్తున్నట్లుండే శిల్పాలు కనిపిస్తాయి. 15వ గుహలోని లింగం నుంచి ఉద్భవిస్తున్న పరమేశ్వరుణ్ణి పూజిస్తున్న బ్రహ్మ, విష్ణువుల, నటరాజ శిల్పాలు చూపరులను ఎంతగానో ఆకర్షిస్తాయి. 16వ గుహ ఎల్లోరా గుహలన్నిటిలోకి సుప్రసిద్ధమైంది. ఈ గుహను కైలాస గుహ అంటారు. సందర్శకులను ఎంతగానో అలరించే ఈ గుహ అన్నిటికన్నా సుందరంగా ఉంటుంది. అతి పెద్దగా ఉన్న రాయిని రెండంతస్తుల అందమైన దేవాలయంగా మలిచారు. ఈ ఆలయాన్ని ఏనుగులు మోస్తున్నట్లుగా చుట్టూతా వాటి శిల్పాలను చెక్కి ఉన్నవి. ముఖ్యద్వారం దగ్గర మహాభారత ఘట్టాలు, శ్రీకృష్ణుని బాల్యం, ఆయన లీలలు కళ్లకు కట్టినట్టుండే శిల్పాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఆలయం మధ్య భాగంలో ఒక శివలింగం ఉంటుంది. 21, 22వ గుహల్లో అర్ధనారీశ్వరుల వివాహ ఘట్టం, శివతాండవం దృశ్యాలను శిల్పాల రూపంలో పదిలపరిచారు. కైలాస పర్వతాన్ని ఎత్తుతున్నట్లుండే రావణుని శిల్పం ఎంతో చక్కగా ఉంటుంది.

30 నుంచి 34 వరకు గల గుహలు జైనులకు సంబంధించినవి. వీటిలో మహావీరుని పుట్టుపూర్వోత్తరాలకు సంబంధించిన విషయాలను శిల్పాలుగా చెక్కారు. ఈ గుహల పైకప్పులపై చెక్కిన కమలం ఎంతో అందంగా ఉంటుంది. 32వ గుహలో గోమటేశ్వరుని విగ్రహం సృజనాత్మకంగా ఉంటుంది. ఈ విగ్రహానికి ఒక ప్రత్యేకత ఉంటుంది. పాములు, తేళ్లు వంటివి పాకుతున్నట్లుంటుందా విగ్రహం. 34వ గుహలోని గోమటేశ్వరుడు, పార్శ్వనాథుడు, మహావీరుని శిల్పాలు ఎంతగానో ఆకర్షిస్తాయి.

చాంద్‌మినార్

మన దేశంలో ఎత్తైన మినార్లలో రెండోదైన చాంద్‌మినార్ చారిత్రాత్మక పట్టణమైన ఔరంగాబాద్‌లో ఉంది. చక్కటి నైపుణ్యంతో, వెండి బంగారంతో నేసిన చీరలు ఇక్కడ లభిస్తాయి. బిద్రి అనే హస్తకళా వస్తువులకు ఇది పుట్టినిల్లు.

ఘృష్ణేశ్వరాలయం

ఔరంగాబాద్ నుంచి ఎల్లోరాకు 32 కిలోమీటర్ల దూరముంటుంది. వాటి మధ్యలోనే ఘృష్ణేశ్వరాలయం ఉంది. ఈ ఆలయాన్ని 18వ శతాబ్దంలో రాణి అహల్యాబాయి హోల్కర్ పునరుద్ధరించారు. జ్యోతిర్లింగానికి అభిషేకానికి కావలసిన వస్తువులన్నీ అక్కడే అమ్ముతారు. అయితే అక్కడ పూజ జరిపించాలనుకున్న పురుషులు చొక్కా లేకుండా పంచెతో మాత్రమే వెళ్లాలి.

ఎలా వెళ్లాలి?

సికింద్రాబాద్ నుంచి మన్మాడ్ వరకు సికింద్రాబాద్-మన్మాడ్ ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్‌లో వెళ్లాలి. అక్కడి నుంచి ఔరంగాబాద్ వరకు 100 కిలోమీటర్లు ఉంటుంది. ఎల్లోరా సిటీ టూర్ ప్యాకేజీ పేరున ఔరంగాబాద్ చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాలను చూపించడానికి బస్సులుంటాయి. ఇవి ప్రతి అరగంటకు ఉంటాయి. అలాగే ఔరంగాబాద్ నుంచే ప్రత్యేకంగా అజంతా టూర్ ప్యాకేజీ కూడా ఉంది. మహారాష్ట్ర ఆర్టీసి, ప్రయివేటు బస్సులు అన్నీ ఈ ప్యాకేజీలను నడుపుతాయి. అజంతా గుహలను సోమవారం, జాతీయ సెలవు దినాల సమయంలో, ఎల్లోరా గుహలను మంగళవారం, జాతీయసెలవు దినాల సమయంలో మూసి ఉంచుతారు. మిగతా రోజుల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సందర్శకుల కోసం తెరిచి వుంచుతారు. అయితే గుహల్లోకి వెళ్లేప్పుడు ఒక టార్చిలైటు, సరిపడా మంచినీళ్ల వెంట తీసుకుపోవడం మంచిది. ★



అజంతా గుహలోని శిల్పాలు...



ఎల్లోరా గుహలో ఒక భాగం

చాంద్‌మినార్

కొత్త పుస్తకాలు

మీకు దగ్గర్లోనే...

మీకు దగ్గర్లోనే...
(కవితా సంపుటి)
కవి : కె. ఆంజనేయకుమార్,
పేజీలు : 176, వెల : 50/-,
ప్రతులకు : కె.ఆంజనేయకుమార్,
28-17-6, రామమందిరం వీధి,
అరండల్‌పేట, విజయవాడ - 520002.
సెల్ : 9490597282.



నూట డెబ్బైఆరు పేజీల్లో అరవైకి పైగా కవితలను ఈ సంపుటిలో కవి ప్రచురించారు. చాలా కవితలు వివిధ సందర్భాల్ని దృష్టిలో పెట్టుకుని రాసినవి... పలు పత్రికల్లో ప్రచురణలు, బహు"మతులు" పొందిన కవితలే.... ప్రముఖ కవి డా॥ అద్దేపల్లి రామ్మోహన్‌రావు, డా॥నందిని సిధారెడ్డి లాంటి పెద్దలు ముందుమాటలు రాశారు. ప్రపంచీకరణ వ్యతిరేకతే ఈనాటి కవిత్వంలోని ప్రధాన సూత్రం, ఏ సమస్య మూలాల్లోకి వెళ్లినా ప్రపంచీకరణ పెత్తనం ప్రస్ఫుటంగా నేడు కనిపిస్తుంది. అద్దేపల్లి వారు అన్నట్లుగానే మానవత్వం మీద మార్కెట్ శక్తులూ, స్వదేశీ సంస్కృతి మీద విదేశీ దుష్ప్రభావమూ, నాయకుల స్వార్థం వల్ల విజయం సాధిస్తుండటమే ఈ నాటి గొప్ప విషాద నేపథ్యం.

"మనసు దగ్గర్లో... మంచి కవిత్వం" అంటూ డా॥ నందిని సిధారెడ్డి గారు కూడా కవిని, కవితల్లోంచి వస్తువునూ, శిల్పాన్నీ విడి... విడిగా... చూసే వాళ్ల మెచ్చుకునే ప్రయోగాలెన్నో ఆంజనేయకుమార్‌లో కన్పిస్తాయి" అన్నారు. తనదైన కవిత్వ సామాగ్రిని పదచిత్రాలుగా/ పదబంధాలుగా/ పదప్రయోగాలుగా/ మలుస్తూ అద్భుతమైన కవితల్లో తరచుగా ఆంజనేయకుమార్ (పలు పత్రికల్లో) కనిపిస్తారు. ఎంత బాగా కవిత్వం రాసినా! రాజకీయ దృక్పథంలో స్పష్టత లేకుంటే... ఆ కవిత్వం నిలబడదు.... ఉదాహరణకు "కొండకుర్చీ"(పేజీ107) కవితలో ముదిగొండ మట్టికుండ కాదు/ ఏ లారీల తుఫాన్‌లకో కరిగి నేల పారదు/ ముదిగొండ మృదుకుండ కాదు/ వేసవి వేడి తగ్గగానే నేలపాలవ్వదు" అంటాడు కవి. మార్క్సగిరి (పేజీ75), ఎర్రదేవుళ్లు(పేజీ97) కవితలు... మార్కిస్ట్ పార్టీపై ఎక్కుపెట్టిన కవితలే... ఈ రెండు కవితలు... సెజ్‌లను దృష్టిలో పెట్టుకుని రాసినవే!! పేజీలు11,12,13లలో ఈ అంశాలపై కవికి... డా॥అద్దేపల్లి చేసిన సూచన... నందిగ్రామ్‌పై తొందరపడి అభిప్రాయ ప్రకటన చేసిన-చేస్తున్న కవులకు పాఠం లాంటిది... అద్దేపల్లే కాదు... జ్వాలాముఖి లాంటి పెద్దలు కూడా బెంగాల్ అంశాలపై తమ రాజకీయ స్పష్టత విధానపరంగా పలు సభల్లో తెలియజేశారు... బెంగాల్ వెళ్లి వచ్చిన కవి, రచయితల బృందాలు... ఆంధ్రా చేరిన తర్వాత పునరాలోచనలో పడ్డారు. మౌనం వహించారు... వాస్తవాలు తెలుసుకొన్నారు... శ్రమజీవుల రాజ్యాకాంక్షతో ఉద్యమించే శక్తుల్ని! కుర్చీ కోసం దేనికైనా తెగించే (అ)రాజకీయ పార్టీల్ని ఒకేగాట కట్టడం సరైన పద్ధతి కాదు.

"పాలు చాలని బిడ్డకోసం అల్లాడే/ తల్లి గుండె కూడా/ పాలివ్వడానికి బైటకొచ్చినట్లు/ మూడు పొదుగులతో ఉన్న/ నా తల్లి పాలిండ్లనెవడురా ధ్వంసం చేసింది?" అంటారు 'కసాయం' అనే కవితలో కవి (పేజీ83)... నాన్న పోయినపుడు(పేజీ23), దర్జీ వేమన(పేజీ102) లాంటి కవితలు... పాఠకుల్ని ఆకట్టుకోవడమే కాక ఆలోచింపచేస్తాయి. ఆర్ద్రతతో మానవత్వాన్ని మేల్కొల్పుతాయి.

- తంగిరాల చక్రవర్తి

నీకు నాకు మధ్య ఒక రంగుల నది

నీకు నాకు మధ్య ఒక రంగుల నది
(కవితా సంపుటి)
అనుసృజన : డా॥దేవరాజు మహారాజు
పేజీలు : 200, వెల : 160/-,
ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి,
నవోదయ బుక్‌హౌస్‌లలో



చాలా కాలం తర్వాత ఒక మంచి కవితా సంపుటి చదివాము అన్న సంతృప్తిని కలిగిస్తుంది ఈ కవితా సంకలనం. 24 దేశాల కవిత్వాల్ని, 42 మంది భారతీయ భాషాకవుల కవిత్వాల్ని, 21 మహిళా కవయిత్రుల కవిత్వాల్ని ఈ గ్రంథంలో చూడవచ్చు (చదవొచ్చు). కవిత్వమే మానవుడి శాశ్వత చిరునామా! కవిత్వమే మానవుడి అవధి, పరమావధి!! అని నమ్మిన కవి డా॥ దేవరాజు మహారాజు. భాషాసాహిత్య పీఠాలు, అకాడమీలు, విశ్వవిద్యాలయాలు చేపట్టి నిర్వహించాల్సిన ఓ విశిష్టమైన ఈ అనువాద ప్రక్రియను ఒంటరిగా వ్యక్తిగా చేయడం గొప్ప సాహసం. కవి మహత్తర విజయం. అర్జెంటైనా, ఆస్ట్రియా, చైనా, డెన్మార్క్, జర్మనీ, ఇటలీ, జపాన్, లాటిన్ అమెరికా, పాకిస్థాన్, పోలెండ్, రష్యా, కొరియా, ఆఫ్రికా, యుగోస్లేవియా లాంటి దేశాల కవిత్వాల్ని పరిచయం చేయడం... ఆ కవిత్వాలు చదువుతుంటే అచ్చ తెలుగు కవులు రాసినట్టే అనిపించేలా అనుసృజన చేసిన కవికి హేట్సాఫ్. ఉత్తమాభిరుచిని కవిత్వంపై కలుగజేశారు.

జర్మన్ నాటక కర్త బెర్తొల్ బ్రెష్ట్ కవిత "తిరగబడ్డవాళ్లు" (పేజీ34) కవితలోని ఈ వాక్యాలు చేయి తిరిగిన తెలుగు కవి రాసినట్టే అనిపిస్తాయి. "ప్రస్తుతానికి నీడనిచ్చిన ఈ దేశం ఒక మజిలీ అవుతుందే తప్ప ఇల్లెలా అవుతుంది?"

అలాగే పేజీ 43లో పాబ్లోనెరుడా కవిత "ఒకపదం"లో కవి ఇలా అంటారు.

"మానవ పదం ఒక గుణితాక్షరం/ విస్తరిస్తున్న వెలుగూ లలిత కళల మేలు కలయిక / అది రక్తపు వ్యవహార సరళి/ ఇక్కడే నిశ్శబ్దమంతా మూటకట్టేది/" (పేజీ43).

ఆయా కవుల క్లుప్త పరిచయం కూడా ఇవ్వడం బాగుంది. అలాగే భారతీయ భాషా కవుల కవిత్వాన్ని, కవుల్ని పరిచయం చేయడం కూడా ఓ ప్రయోగమే. భాషలో, భావంలో, అభివ్యక్తిలో తనదైన ప్రత్యేక శైలిని కలిగివున్న దేవరాజు మహారాజు అనువాదం చాలా సరళంగా, హాయిగా వుంది. కొంకణి కవి "వాసుదేవ్ శాన్‌భాగ్" రాసిన 'కొంకణి అంతరంగం' కవిత చివర్లోని వాక్యాలు మనల్ని వెంటాడుతాయి. "శక్తి వుంటేనే, చేవ వుంటేనే నాలోకి రండి" అని సముద్రం సవాల్ విసురుతూ నిరంతరం గర్జిస్తూ వుంటుంది. అలాగే ఈ సంపుటిలో కవిత్వం గురించి ప్రముఖ సాహిత్యకారుల అభిప్రాయాలు... సూక్తులుగా ప్రచురించడం బాగుంది. 15 భాషలు, 4 మతాలు, లెక్కలేనన్ని తెగలు, వర్ణాలు వున్నా భారతీయ సాహితీ- సంస్కృతి-ప్రశస్తిని మానవీయ కోణంలో రాసిన కవితల్ని ఒకే చోట చేర్చడం బాగుంది. తమిళ్, పంజాబీ, మరాఠీ, కన్నడ, హిందీ, గుజరాతీ, డోంగ్రీ, బెంగాలీ, అస్సామీ, మళయాళీ కవితలు అందర్నీ ఆకట్టుకునేలా అనుసృజన చేసిన డా॥దేవరాజు మహారాజు అభినందనీయులు.

- టి. సి



బుల్లి పోస్టాఫీస్

ప్రపంచంలోనే అతి చిన్న పోస్టల్ సర్వీసు ఒకటుంది తెల్సా! ఇది శాన్ ఫ్రాన్సిస్కోలో ఉంది. దాని పేరు కూడా చిన్నదే. టీనీ టినీ పోస్టాఫీస్. అన్నట్టు ఇది సంచార పోస్టల్ సర్వీసు. లీ రెడ్‌మాండ్ దీని పోస్ట్‌మాస్టర్. సారీ... పోస్ట్ ఉమన్. ఆమె తన చిన్న మొబైల్ ఆఫీసును కేఫుల్లో, షాపుల్లో పెడతారు. అక్కడ వారెవరైనా ఉత్తరాలు రాస్తే వాటిని ప్రపంచపు అతి చిన్న ఉత్తరంగా మారుస్తారు. దాన్ని అతి చిన్న స్క్రిప్టులోకి మార్చి దాన్ని ఎన్‌వలప్ కవర్‌లో పెట్టి దానిమీద ఆ ఉత్తరం రాసినవారి ఇంటిపేరును మైనంతో అంటిస్తారు. తరువాత దాన్ని భూతద్దం మీద మైనంతో అంటిస్తారు. ఈ ఉత్తరం రాసిన వారు, అందుకున్న వారు ఒక రకమైన ఆనందాన్ని పొందుతారట. వారే కాదు ఇంతటి సేవలందిస్తున్న ఆ పోస్టల్ సర్వీసు వారికి కూడా చాలా ఆనందంగా వుందట. ఈ సేవలు ప్రత్యేకమైన సందర్భాలలో, పార్టీలలోనూ లభ్యమౌతాయి.



పొట్టి రాజు - చిట్టి రాణి

-పుప్పాల కృష్ణమూర్తి

సుమపురం రాజ్యంలోని పిచ్చుకపల్లిలో గోపయ్య, గోపమ్మ అనే దంపతులుండేవారు. కులవృత్తయిన కుండలు చేసుకుని, వాటిని అమ్ముకుంటూ ప్రశాంతంగా జీవిస్తున్నారు. వారి దిగులల్లా పిల్లలు లేరనే. కనపడ్డ రాయికల్లా మొక్కి, దేవుడనుకున్న విగ్రహానికల్లా కొబ్బరికాయ కొట్టింది. కానీ గోపమ్మకు సంతానం కలగలేదు.

ఒక రోజు భర్త సారె మీద కుండలు చేస్తుంటే, రేగడి మన్ను తీసుకుని జానెడంత పిల్లవాడి బొమ్మ చేసింది. 'ఇలాంటి బాబునన్నా దేవుడు నాకు ప్రసాదించకపోయే' అని అనుకుంటూ పక్కలో పెట్టుకుని పడుకుంది. తెల్లవారి ఎవరో పిలిచినట్లనిపిస్తే లేచింది. జానెడంత పిల్లవాడు 'అమ్మా... అమ్మా' అని పిలుస్తున్నాడు. ఆమెకు చెప్పలేనంత ఆశ్చర్యమనిపించింది. పిల్లవాణ్ణి తాకి నిజమా కలా అని చూసుకుంది. బాబును చేతిలోకి తీసుకుని కల కాదు నిజమే అని నిర్ధారించుకుంది. "నేను నీ బాబునేనమ్మా, నాకు ఆకలౌతోంది అన్నం పెట్టు" అన్నాడు జానెడంత బాబు. పట్టలేని సంతోషంతో బాబును చేత్తో పట్టుకుని భర్త దగ్గరకు పరిగెత్తింది. "మనకు బాబు పుట్టాడండి. జానెడే వున్నాడు. నిజంగా ప్రాణం వస్తుందనుకుంటే పెద్ద పిల్లవాణ్ణే చేసుందును" అంది కాస్త విచారంగా.

"పిల్లవాడు ఎంత ఎత్తున్నాడన్నది కాదు, ఉన్నాడా? లేడా అన్నది ముఖ్యం. నీకు గొడ్రాలనే నింద మాసిపోయింది. గడకర్ర ఎత్తుండి తెలివి తేటలు లేకుంటే ఏం లాభం? జానెడున్నా నా కొడుకు జగాన్నేలుతాడు. ముఖంలో అద్భుతమైన తెలివితేటలు కనపడుతున్నాయి. అందుకే వాడి పేరు రాజు" అన్నాడు గోపయ్య.

గోపమ్మ ఇంట్లోకి పరిగెత్తి అన్నం పెట్టి, పప్పేసి, నెయ్యేసి, పెరుగేసి తృప్తిగా పెట్టింది. రాజు అన్నం తినేసరికి గోపయ్య బండికి ఎడ్లను కడుతున్నాడు. "ఎక్కడికి నాన్నా వెళదామనుకుంటున్నావు" అనడిగాడు పొట్టిరాజు.

"చెరువుకు పోయి రేగడిమట్టి తేవాలి కదరా. ఆ మట్టే మనకు బువ్వ పెట్టేది" అన్నాడు.

"నువ్వెందుకు నాన్నా. నేను వెళ్లి తీసుకొస్తాగా. నువ్వు ఇంటికాడ విశ్రాంతి తీసుకో" అన్నాడు పోలుగర్రమీద నుండి బండిలోకి ఎక్కుతూ. తండ్రి అవాక్కయి చూస్తుండిపోయాడు. వీడు పుట్టీ పుట్టగానే ఎంత భక్తి, ఎన్ని తెలివి తేటలు అనుకున్నాడు.

"నువ్వేం దిగులుపడకు నాన్నా. నేను మట్టి తీసుకొస్తాగా" అని పగ్గాలు చేతిలోకి తీసుకుని ఎద్దుల్ని అదిలించాడు. ఎద్దులు నేరుగా చెరువులోకి దారి తీశాయి. ఎప్పుడూ మట్టి తెచ్చే చోటికి వెళ్లి నిలబడ్డాయి. బండి దిగి తట్ట, పార, గడ్డపార, కిందపడేశాడు. తను ఈ బండి నింపాలంటే చాలాసేపు పట్టుద్ది. ఎవరన్నా కనిపిస్తారేమోనని చుట్టూ చూశాడు. దూరంగా చెరువులో ఇద్దరు మనుషులు గాలాలు వేసి చేపలు పడుతూ కనిపించారు. వాళ్ల దగ్గరకు నేరుగా వెళ్లి "మీకు చేపలు పడడం లేదు కదా?" అన్నాడు.

"అవును. చీకటితో వచ్చాం. ఒక్క పరకపిల్లన్నా పడలేదు. ఇవ్వాళ పెద్దమ్మోరు మా నెత్తిమీద కూర్చున్నట్లుంది" అన్నాడు బక్కగా, ఎత్తుగా వున్నతను.

"మీ దురదృష్టాన్ని నేను అదృష్టంగా మారుస్తాగా. రెండు బుట్టల నిండా చేపలు పడే మంత్రం నా దగ్గరుంది" అన్నాడు.

వాళిద్దరూ అతి వినయంగా "దయచేసి ఆ మంత్రం మాకు ఉపదేశించరా? నీ పేరు చెప్పకుని పిల్లలకింత గంజి తాపుకుంటాం" అన్నారు.

"నేను మంత్రాన్ని ఎవరికీ చెప్పలేదు. ఇక ముందు చెప్పను కూడా. మీకు చేపలేగా కావాల్సింది. మీకు సరిపోను నేను పట్టిస్తా. నేను చెప్పిన పని మీరు చెయ్యాలి" అన్నాడు పొట్టిరాజు దర్పంగా.

"ఆజ్ఞాపించండి. చిటికెలో చేస్తాం. మాక్కావల్సింది చేపలు" అన్నారిద్దరూ.

"ఆ బండి పక్కనే వున్న రేగడిమట్టి తవ్వి, జల్ల నింపాలి. మీరు నింపేసరికి నేను బుట్ట నిండా చేపలు పడతా" అన్నాడు.

ఉత్సాహంగా బండివైపు నాలుగడుగులు వేసి, మేం మట్టి నింపుతాం. కానీ నీకు చేపలు పడకుంటే..." సందేహం వెలిబుచ్చాడు నల్లగా లావుగా వున్నతను.

"చేపలు పడకుంటే మీకు చెరో ఎద్దునిస్తా, అమ్ముకుని సంతోషంగా రాత్రికి విందు చేసుకోండి. సరేనా?" అన్నాడు.

"అలాగే.." అంటూ బండివైపు వెళ్లారు.

వాళ్లిచ్చిన గాలాన్ని చేతిలోకి తీసుకుని దానికున్న ఎరను తీసివేశాడు. మరో ఎరను గాలానికి కుచ్చి, దానిమీద ఉమ్మివేసి "గాలానికి చేపకు అంటుల్లా" అన్నాడు. తర్వాత గాలాన్ని నీటిలోకి వదిలాడు. అదేం చిత్రమో కానీ అంత క్రితం దాకా గాలం వైపు కన్నెత్తి చూడని చేపలు, గుంపులు గుంపులుగా వచ్చి గాలానికి తట్టుకోసాగాయి. వాటిని రప్పరప్పమని వెలుపలకి లాగి, బుట్టల్లో వేయసాగాడు. కొన్ని నిమిషాల్లోనే రెండు బుట్టలూ నిండిపోయాయి. వాటిని రెండు చేతులతో పట్టుకుని బండివద్దకు వచ్చాడు పొట్టిరాజు. బండి కూడా రేగడి మట్టితో నిండిపోయింది.

"మీ బుట్టలు నిండిపోయాయి. సంతోషంగా ఇంటికి వెళ్లండి" అన్నాడు వారితో.

వాళ్లు తట్టలు పక్కన పడేసి, గబగబా బుట్టల వద్దకు వెళ్లి నిండా చేపలు ఉండడం చూసి ఆశ్చర్యపడ్డారు. 'ఇంత చిన్న పిల్లవాడు ఇన్ని చేపలు పట్టడమేంటి? చిత్రం కాకుంటే' అనుకున్నారు. ఆనందంతో బుట్టలు పట్టుకుని బండి దగ్గరకు వచ్చారు. "చాలా సంతోషమయ్యా, మీ పేరు చెప్పకుని విందు చేసుకుంటాం. మాతో పాటు, మీరు కూడా చేపలు తినండీ రోజు" అని చెరో చేపను పట్టుకుని రాజుకిచ్చారు. రాజు ఆ చేపల్ని బండ్లో వేశాడు. రేగడిమట్టి నింపిన బండి తోలుకుంటూ ఇంటికెళ్లాడు. వస్తున్న కొడుకును చూసి పరమానందభరితుడయ్యాడు తండ్రి. మట్టిని పెరట్లో కార్చేసి, చేపలు రెండూ తల్లికిచ్చాడు. వాటిని కోసి కూరొండమని చెప్పాడు. గోపమ్మ వాటిని గాబు దగ్గర రుద్ది అడ్డంగా కోసింది. ఆశ్చర్యం. ఒక చేప కడుపులో బంగారు వుంగరం వుంది. మరో చేప కడుపులో తాళిబొట్టు వున్న బంగారు నానుతాడు కనిపించింది. ఆమె ఆనందంతో అవి తెచ్చి కొడుక్కిచ్చింది. 'రాజకుమారితో నా పెళ్లికి ఇవి వుండాలి' అని వాటిని జేబులో వేసుకున్నాడు.

మరుసటిరోజు తండ్రి చేసిన కుండలను బండినిండా పేర్చుకుని సంతకు బయలుదేరాడు. మొదట వచ్చిన వల్లభాపురంలో కొన్ని కుండలు అమ్మి, మిగతావి కేతేపల్లి సంతలో అమ్ముదామని బండిని అదిలించాడు.

"ఓయ్... పిల్లగా, నువ్వు జానెడు లేవు, బండిని లగాయించి తోలుతున్నావు గానీ అడవిలో ఒంటరిగా వెళ్లడం మంచిదికాదు. దొంగలున్నారు. నిర్దాక్షిణ్యంగా చంపి దోచుకుంటారు. వాళ్లని పట్టుకోవాలని రాజు ఎంత ప్రయత్నించినా దొరకలేదు. వాళ్లని చంపినా, సజీవంగా పట్టిచ్చినా పెద్ద బహుమతి ఇస్తానని ప్రకటించాడు. చాటింపు వినలేదా?" అన్నాడు అరుగుమీద కూర్చున్న పెద్దమనిషి.

"నన్నేం అనరులే తాతా. ఎందుకంటే నేను పొట్టిరాజును కదా" అన్నాడు ఎద్దుల్ని ముందుకు అదిలిస్తూ.

అడవి మధ్యలోకి వెళ్లగానే చెట్టుమీద నుంచి దొంగలిద్దరు గబాల్న బండిమీదకు దూకారు. "అరే పొట్టోడా బండాపరా. మర్యాదగా నీ దగ్గరున్న డబ్బులు, బంగారం మా చేతిలో పెట్టి వెళ్లు. లేదంటే అన్యాయంగా చనిపోతావు" అన్నారిద్దరూ.

(ఆ తర్వాత ఏమైంది? పొట్టి రాజు దొంగ బారి నుంచి ఎలా బయటపడ్డాడు? తెలియాలంటే మరో వారం రోజుల పాటు ఎదురుచూడాల్సిందే)